
ఆంధ్రజ్యోతి
ఉష్ణోగ్రతలు గరిష్ఠం : 37.0 । కనిష్ఠం : 26.0
ANDHRAJYOTHY
5


నాణ్యమైన ధాన్యం కొనుగోలు చేయాలి

- వనపర్తి కలెక్టర్ ఆదర్శ్ సురభి


రాజపేట కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ ఆదర్శ్ సురభి

వనపర్తి రూరల్, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): నిబంధనల ప్రకారం నాణ్యమైన ధాన్యం కొనుగోలు చేయాల్సిన బాధ్యత కొనుగోలు కేంద్రాల నిర్వాహకులదేనని వనపర్తి కలెక్టర్ ఆదర్శ్ సురభి అన్నారు. సోమవారం వనపర్తి మండలంలోని రాజపేట గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను తనిఖీ చేశారు. కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చిన ధాన్యం తేమ శాతం, రిజిస్టర్లను పరిశీలించారు. తాలు, గడ్డి అధికంగా ఉండటంతో పెడస్టల్‌ఫ్యాన్, పాడి క్లీనర్ ద్వారా శుభ్రం చేసి కొనుగోలు చేయాలని నిర్వాహకులను ఆదేశించారు. కొనుగోలు కేంద్రంలో సరైన వసతులు లేకపోవడం, రిజిస్టర్లు సరిగ్గా నిర్వహించకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దొడ్డు రకం, సన్న రకం కొనుగోలు కేంద్రాలు వేరువేరుగా నిర్వహించాలని, శిక్షణ పొందిన వారే సెంటర్ ఇన్‌చార్జిగా ఉండాలని ఆదేశించారు. ఆయన వెంట జిల్లా సివిల్ సప్లయ్ అధికారి విశ్వనాథ్, తహసీల్దార్ రమేశ్ రెడ్డి, తదితరులు ఉన్నారు.

భూ భారతి చట్టం రైతులకు చుట్టం

- నాగర్ కర్నూలు ఎంపీ డాక్టర్ మల్లురవి


ఆలయ అభివృద్ధి పనులపై మల్లు రవికి వినతి పత్రం అందజేస్తున్న జోగులాంబ ఆలయ అధికారులు

6

అంతుచిక్కని ఆరుగురి ఆచూకీ

- షీర్ జోన్‌లో తవ్వకాలపై సందిగ్ధం
- కొనసాగుతున్న నీటి ఊట పంపింగ్


సొరంగంలో తవ్వకాల్లో వెలువడిన బండరాళ్లు, టీబీఎం శకలాలు

7


వనపర్తి జిల్లా పెద్దమందడి మండలంలో నేలకొరిగిన వరి పైరు


నారాయణపేట జిల్లా కొత్తపల్లిలో ఈదురు గాలులకు నేల రాలిన ధాన్యం

అకాలం కన్నెర్ర

- ఓవైపు ఎండలు.. మరోవైపు వానలతో దెబ్బతింటున్న పంటలు
- ఉమ్మడి పాలమూరులో 9,409 ఎకరాల్లో తీవ్ర నష్టం
- భారీ ఈదురు గాలులతో నేలకొరుగుతున్న పంటలు.. రాలుతున్న మామిడి కాయలు
- కొనుగోలు కేంద్రాల్లో తడుస్తున్న ధాన్యం
- నష్టంపై ప్రభుత్వానికి ప్రతిపాదనలు.. పరిహారంపై రైతుల్లో ఆశలు


వనపర్తి జిల్లా పీపనగండ్ల మండలంలో నేలరాలిన మామిడికాయలు

మహబూబ్‌నగర్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఆరుగాలం శ్రమిస్తున్న రైతులు.. అటు నీటి ఎద్దడి, ఇటు అకాల వర్షాలతో సతమతమవుతున్నారు. ఈ యాసంగిలో మొన్నటి వరకు పంటలు ఎండిపోయి కొందరు నష్టపోగా, ఎలాగోలా పంటను బతికించుకుని చివరి దశలో ఉన్న వారి పంటలను అకాల వర్షాలు దెబ్బతీశాయి. ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తెచ్చిన తర్వాత కూడా సరైన సౌకర్యాలు లేక.. తడిసి ఇబ్బందులకు గురవుతున్నాడు. గత ప్రభుత్వంలో ప్రకృతి వైపరిత్యాల కారణంగా పంట నష్టపోతే పరిహారం దక్కేందుకు అవకాశం లేకపోయేది. ప్రస్తుత ప్రభుత్వం గత వానాకాలంలో పంట నష్టపోయిన రైతులకు రూ.10 వేల చొప్పున పంట పరిహారం అందజేసింది. అయితే యాసంగి సీజన్‌లోనూ వివిధ కారణాల వల్ల పంటలు దెబ్బతినడంతో నష్ట పరిహారం ఇవ్వాలని రైతులు కోరుతున్నారు. ఇప్పటికే ఆయా జిల్లాల్లో వ్యవసాయ అధికారులు పంట నష్టం అంచనా వేసి, నష్ట పరిహారం కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. దీనిపై ప్రభుత్వం ఇంకా స్పందించాల్సి ఉంది. ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో వరి కోతలు వేగంగా జరుగుతున్నాయి. రైతులు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తరలిస్తున్నారు. ఇంకా కోతకు వచ్చే విస్తీర్ణం కూడా భారీగానే ఉంది. ఈ నెలాఖరు వరకు కోతలు చేపట్టే అవకాశం ఉండగా.. ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షం వల్ల నష్టం జరుగుతూనే ఉంది. కొనుగోలు కేంద్రాల్లో వేగంగానే సేకరణ జరుగుతున్నప్పటికీ.. ధాన్యం ఎక్కువగా వస్తుండటంతో ఇంకా వేగం పెంచాల్సిన అవసరం ఉంది. లేకపోతే అక్కడ కూడా ధాన్యం తడిసి.. రైతులకు ఇక్కట్లు తప్పవనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

ఉమ్మడి జిల్లాలో సాగు, నష్టం వివరాలు

జిల్లా	సాగు విస్తీర్ణం	నష్టం
మహబూబ్‌నగర్	1,87,936	5648
నారాయణపేట	1,78,000	1064
గద్వాల	1,39,059	1000
వనపర్తి	1,89,355	1145
నాగర్‌కర్నూల్	3,98,052	552

ఉమ్మడి జిల్లాలో 9,409 ఎకరాల్లో పంట నష్టం..

మొన్నటి వరకు

(మిగతా 6లో..)

శిలాఫలకాలకే పరిమితమైన చేనేత పార్కు

- 2008లో ముఖ్యమంత్రి వైఎస్సార్, 2018లో మంత్రి కేటీఆర్ శంకుస్థాపన
- రూ.52 కోట్లతో తయారు చేసిన డీపీఆర్
- ప్రభుత్వం నుంచి లభించని ఆమోదం
- పార్కు స్థలం నుంచి మట్టి తరలిస్తున్న అక్రమార్కులు
- ప్రహరీ నిర్మించాలని కోరుతున్న సంఘం నాయకులు


కేటీఆర్ శంకుస్థాపన చేసిన శిలాఫలకం

చేనేత జరీ చీరలకు పేరుగాంచింది జోగులాంబ గద్వాల జిల్లా.. ఇక్కడి నేత కార్మికుల నైపుణ్యాన్ని పెంపొందించడంతో పాటు వారి ఆదాయాన్ని పెంచేందుకు గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం గద్వాలలో చేనేత పార్కు నిర్మించేందుకు నిర్ణయించింది. అందుకు 47.25 ఎకరాల స్థలాన్ని సేకరించింది. అప్పటి ముఖ్యమంత్రి రాజశేఖర్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. ఆ తరువాత బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో మంత్రి కేటీఆర్ కూడా శంకుస్థాపన చేశారు. కానీ హ్యాండ్లూమ్, పవర్ లూమ్‌ల క్లస్టర్ల ఏర్పాటు కాలేదు. ఆ పార్కు స్థలంపై మట్టి మాఫియా కన్నుపడింది. ఈ స్థలంలోని మట్టిని వారు అక్రమంగా తరలిస్తూ, సొమ్ము చేసుకుంటున్నారు. ఆ స్థలాన్ని కాపాడుకునేందుకు ప్రహరీ నిర్మించి, హ్యాండ్లూమ్, పవర్‌లూమ్ క్లస్టర్లు ఏర్పాటు చేయాలని చేనేత కార్మిక సంఘాల నాయకులు కోరుతున్నారు.


మాఫియా అక్రమంగా మట్టి తరలించిన చేనేత పార్కుస్థలం

గద్వాల, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : గద్వాల చేనేత జరీ చీరలకు దేశవిదేశాలలో మంచి గుర్తింపు ఉంది. ఇక్కడి కార్మికుల నైపుణ్యం, నాణ్యమైన ముడిసరుకుతో తయారు చేయడంతో ఆ పేరు తెచ్చిపెట్టింది. ఉమ్మడి జిల్లాలో వేలాది మంది చేనేత కార్మికులు దీనిపైనే ఆధారపడి జీవిస్తున్నారు. వీరిలో నైపుణ్యాభివృద్ధిని పెంపొందించడంతో పాటు వారి ఆదాయాన్ని రెట్టింపుచేయాలనే తలంపుతో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం గద్వాలలో చేనేత పార్కును ఏర్పాటు చేసేందుకు స్థల సేకరణ చేసింది. జోగుళాంబ గద్వాల జిల్లా గద్వాల మండలం పూడూరు శివారులో సర్వే నెంబరు 368/ఏలో 47.25 ఎకరాల భూమిని కేటాయించింది. ఇది గద్వాల-ఎర్రవల్లి ప్రధాన రహదారిపై ఉంటుంది. ఈ పార్కు ఏర్పాటుకు రెండు సార్లు శంకుస్థాపనలు చేసినప్పటికీ నిర్మాణ పనుల్లో మాత్రం అడుగు ముందుకు పడటం లేదు.

ఉమ్మడి జిల్లాలో 11వేల మంది కార్మికులు..

ఉమ్మడి జిల్లాలో దాదాపు 3,500 మగ్గాలు ఉండగా అందులో దాదాపు 11వేల మందికి పైగా కార్మికులు జీవనం సాగిస్తున్నారు. వీరందరూ గద్వాల బ్రాండ్‌తోనే జరీ చీరలు తయారు చేస్తున్నారు. రాజోలి, అయిజ, గట్టు, గద్వాల, అలంపూర్, ఎక్లాస్‌పూరు, బూడిదపాడు, మాచర్ల, అమరచింత, కొత్తకోట, కోటకొండ తదితర ప్రాంతాలలో చేనేత మగ్గాలపై గద్వాల జరీ చీరలను తయారు చేస్తున్నారు. గద్వాల జిల్లాలో 6,948 మంది చేనేత కార్మికులు ఉన్నారు. 14 చేనేత సంఘాలు ఉన్నాయి. వీరికి కాలానుగుణంగా నైపుణ్యాభివృద్ధిని పెంచేందుకు (మిగతా 6లో..)

జీవిత చరిత్రలను అధ్యయనం చేయాలి

- పీయూ వీసీ ప్రొఫెసర్ జీఎన్ శ్రీనివాస్
- ఘనంగా మహనీయుల జయంతి వేడుకలు

7

రోడ్డు ప్రమాదంలో ప్రధానోపాధ్యాయుడి మృతి

- అదుపు తప్పి కల్వర్టును ఢీకొన్న కారు
- ఉద్యోగ విరమణకు కొద్ది రోజుల ముందు దుర్ఘటన

వేసవి సెలవుల్లో ఉపాధ్యాయులకు శిక్షణ

- ఆసక్తి కలిగిన ఉపాధ్యాయులు అప్లయ్ చేసుకోవాలి

7


అమ్రాబాద్‌లో జరిగిన భూ భారతి అవగాహన సదస్సులో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ అమరేందర్

భూ భారతి రైతులకు వరం

అవగాహన సదస్సులో నాగర్‌కర్నూల్ అదనపు కలెక్టర్

అమ్రాబాద్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ధరణి స్థానంలో ప్రవేశ పెట్టిన భూ భారతి చట్టం రైతులకు వరం లాటిందని నాగర్ కర్నూల్ అదనపు కలెక్టర్ అమరేందర్ అన్నారు. సోమవారం నాగర్ కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన భూ భారతి అవగాహన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. 2020 ధరణి చట్టం వల్ల రైతులు అనేక ఇబ్బందులు పడ్డారని తెలిపారు. ప్రస్తుత చట్టంలో హక్కుదారులు మొదటగా తహసీల్దార్‌కు దరఖాస్తులు ఇచ్చిన తర్వాత పరిష్కారం కాకపోతే ఆర్డీవో, కలెక్టర్, సీసీఎల్‌ఏ కమిషనర్ కూడా దరఖాస్తులు ఇవ్వవచ్చని వెల్లడించారు. అప్పటికి పరిష్కారం కానీ సమస్యలకు ఈ చట్టంలో సేవ సహాయాన్ని పొందే అవకాశం కూడా ఉందని అన్నారు. అనంతరం కుమ్మరోనిపల్లిలో పాలమూరు యూనివర్సిటీ ప్రొఫెసర్ మోటమారి మధు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని అదనపు కలెక్టర్ ప్రారంభించారు. కార్యక్రమంలో అచ్చంపేట ఆర్డీవో మాధవి, తహసీల్దార్ శైలేంద్ర కుమార్, అచ్చంపేట వ్యవసాయ మార్కెట్ వైస్ చైర్మన్ రాసు మల్ల వెంకటయ్య, కాంగ్రెస్ పార్టీ నాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

వక్ఫ్ చట్టం సవరణతో ముస్లింలకు అన్యాయం

- గద్వాల పట్టణంలో ముస్లిం సంఘాల ఆధ్వర్యంలో భారీ ర్యాలీ
- మద్దతు తెలిపిన ఎమ్మెల్యే బండ్ల, జడ్పీ మాజీ చైర్‌పర్సన్ సరిత

గద్వాల, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో చేసిన వక్ఫ్‌చట్టం సవరణ బిల్లుపై ముస్లిం సంఘాలు భగ్గుమన్నాయి. సోమవారం గద్వాల పట్టణంలోని ఈద్గా మైదానం నుంచి కలెక్టరేట్ వరకు నిరసన ర్యాలీ నిర్వహించాయి. మోదీ చేసిన వక్ఫ్ చట్టం సవరణతో ముస్లిం వర్గాలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని, తమ ఆస్తులకు ఇబ్బంది కలిగేవిధంగా చట్టంలో మార్పులు చేశారని మండి పడ్డారు. గాంధీ, జ్యోతిబా పూలే, అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాల వేసి నివాళ్లు అర్పించారు.

నిరసన ర్యాలీకి ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, జడ్పీ మాజీ చైర్‌పర్సన్ సరిత, మునిసిపల్ మాజీ చైర్మన్ బీఎస్ కేశవ్‌తో పాటు సీపీఐ, సీపీఎం, ఎంఐఎం, ప్రజా సంఘాలు మద్దతు తెలిపారు. ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. దేశంలో కేంద్ర ప్రభుత్వం మతాల మధ్య చిచ్చుపెట్టి విభజించు, పాలించు అనే విధానాన్ని అవలంభిస్తోందని విమర్శించారు. వక్ఫ్ సవరణ చట్టాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా జడ్పీ మాజీ చైర్‌పర్సన్ సరిత మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం వక్ఫ్ ఆస్తులను కొల్లగొట్టేందుకే వక్ఫ్ సరవణ చట్టం చేసిందని విమర్శించారు. అనంతరం ముస్లిం సంఘాలతో కలిసి అదనపు కలెక్టర్ నర్సింగరావుకు వినతి పత్రం అందజేశారు. ఈ ర్యాలీలో ముస్లిం నాయకులు ఇసాక్, షఫి ఉల్లా, మక్బూల్, గౌస్, వెంకట్రాములు, ఆంజనేయులు, వెంకటస్వామి ఉన్నారు.


ర్యాలీలో పాల్గొని మద్దతు తెలిపిన ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి


అదనపు కలెక్టర్‌కు వినతి పత్రం అందిస్తున్న సరిత, ముస్లింలు

మిర్చి రైతుకు తీరని కష్టం


తడిసిన మిర్చిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే విజయుడు, నాయకులు

మానవపాడు, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): అకాలవర్షం కారణంగా మిర్చి రైతుకు తీరని నష్టం జరిగిందని అలంపూరు ఎమ్మెల్యే విజయుడు అన్నారు. జోగుళాంబ గద్వాల జిల్లా మనవపాడు మండల కేంద్రంలో తడిసిన మిర్చి పంటను సోమవారం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆరుగాలం కష్టపడి పండించిన పంట చేతికి వచ్చేసరికి ధర లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని, ఈ విషయంపై ఇదివరకే అసెంబ్లీలో మాట్లాడానని, మిర్చి రైతుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెవెళ్లి న్యాయం చేసేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. వానకాలంలో పొగాకు సాగు చేయాలని వివిధ కంపెనీలు విత్తనాలు సరఫరా చేసి పంటను కొనుగోలు చేయడంలేదని రైతులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. కార్యక్రమంలో నాయకులు శ్రీకాంత్‌రెడ్డి, వెంకట్రాముడు, చోట, పరమేష్ ఉన్నారు.

రైతులను ఆదుకోవాలి

- అకాల వర్షాలతో నష్టపోయిన పంటలను పరిశీలించిన కిసాన్ మోర్చా కేంద్ర కమిటీ సభ్యుడు పాపన్న గౌడ్


మాదారంలో వరి పైరును పరిశీలిస్తున్న బీజేపీ కిసాన్ మోర్చా నాయకులు, అధికారులు

ఊర్కొండ, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : అకాల వర్షాలతో పంటలు నష్టపోయిన రైతులను ఆదుకోవాలని బీజేపీ కిసాన్ మోర్చా కేంద్ర కమిటీ సభ్యుడు పాపన్నగౌడ్, కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎంటీ. బాలకృష్ణ డిమాండ్ చేశారు. సోమవారం నాగర్‌కర్నూల్ జిల్లా ఊర్కొండ మండలంలోని మాదారం, గుడిగానిపల్లి గ్రామాల్లో నష్టపోయిన మొక్కజొన్న, వరి పంటలను మండల వ్యవసాయ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అకాల వర్షాలతో పంటలు దెబ్బతిని రైతులు బాధలో ఉన్నారని, వారికి రాష్ట్ర ప్రభుత్వం ఎకరానికి రూ.20 నష్ట పరిహారం చెల్లించాలని కోరారు. వారి వెంట కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యదర్శి గోవర్ధన్‌గౌడ్, కార్యవర్గ సభ్యుడు శ్యాంసుందర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి ఉన్నారు.

సోషల్ మీడియా, ఏఐ పట్ల అప్రమత్తంగా ఉండాలి

- త్వరలో హైదరాబాద్‌లో జాతీయ వర్క్‌షాప్
- అర్హులైన జర్నలిస్టులందరికీ అక్రిడిటేషన్ కార్డులు
- తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి



టీయూడబ్ల్యూజే (ఐజేయూ) రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో మాట్లాడుతున్న మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి

కొల్లాపూర్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : మీడియా భవిష్యత్తుకు ప్రశ్నార్థకంగా మారిన సోషల్ మీడియా, ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ పట్ల అప్రమత్తంగా ఉండాలని, దీనిపై త్వరలో హైదరాబాద్‌లో జాతీయ స్థాయి వర్క్‌షాప్ నిర్వహించనున్నామని తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. నాగర్‌కర్నూల్ జిల్లా, సోమశిలలో రాష్ట్ర అధ్యక్షుడు విరహత్ అలీ అధ్యక్షతన జరిగిన టీయూడబ్ల్యూజే (ఐజేయూ) రాష్ట్ర కార్యవర్గ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ మూలంగా భవిష్యత్తులో మీడియా రంగంలో మ్యాన్ పవర్‌ను లేకుండా పోయే ప్రమాదముందని ఆందోళన వ్యక్తం చేశారు. అంతేకాకుండా కల్పితాలతో ఏఐ సమాజాన్ని తప్పుదోవ పట్టించే ప్రమాదం పొంచి ఉందని, దీనిపై జర్నలిస్టులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సోషల్ మీడియా విప్లవం భావ ప్రకటనా స్వేచ్ఛకు మంచి వేదిక అయినప్పటికీ, దాన్ని అడ్డు పెట్టుకొని కొన్ని శక్తులు అలజడి సృష్టించడం సహించరానిదన్నారు. రాజ్యాంగం భావ ప్రకటనా స్వేచ్ఛను కల్పించిందే కానీ, ఇతరుల స్వేచ్ఛను హరించే హక్కు ఇవ్వలేదన్నారు. గత ప్రభుత్వం రూపొందించిన అక్రిడిటేషన్ జీవో అప్రజాస్వామికంగా ఉన్నదని కొందరు న్యాయస్థానాన్ని ఆశ్రయించడంతో దానిని రద్దు చేస్తూ గత అక్టోబరులో హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. దీంతో కొత్త మార్గదర్శకాలను రూపొందించేందుకు కమిటీ వేశామని, అది ప్రభుత్వానికి నివేదికను సమర్పించిందని తెలిపారు. త్వరలో దీనికి సంబంధించిన జీవో విడుదల కానున్నదని తెలిపారు. అక్రిడిటేషన్ కార్డుల విషయంలో జరుగుతున్న తప్పుడు ప్రచారాన్ని ఎవరూ నమ్మవద్దని, అర్హులైన ప్రతీ జర్నలిస్టుకు మంజూరు అవుతుందని తెలిపారు. అక్రిడిటేషన్ కమిటీలను కూడా త్వరలోనే ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఐజేయూ స్టీరింగ్ కమిటీ మెంబర్ దేవులపల్లి అమర్ మాట్లాడుతూ ఉద్యమాలతోనే జర్నలిస్టుల సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. సంఘం నాయకులకు ప్రభుత్వ పదవులు వచ్చినంత మాత్రాన, సంఘ ప్రయోజనాల కోసం కాదని, ఆ బాధ్యతలు వేరుగా ఉంటాయని స్పష్టం చేశారు. రాష్ట్ర అధ్యక్షుడు విరహత్ అలీ మాట్లాడుతూ టీయూడబ్ల్యూజే (ఐజేయూ) ఏ ప్రభుత్వానికీ, ఏ పార్టీకీ అనుకూలం కాదని, జర్నలిస్టుల సంక్షేమమే ఏకైక లక్ష్యమని చెప్పారు. జర్నలిస్టుల ప్రధాన సమస్యలైన ఇళ్లు, ఇళ్ల స్థలాలు, హెల్త్ కార్డులు, అక్రిడిటేషన్ కార్డులు, ఉచిత విద్య తదితర సమస్యలపై ఉద్యమ కార్యాచరణను రూపొందిస్తున్నట్లు తెలిపారు. తమ సంఘం వినతి మేరకు రాష్ట్ర వ్యాప్తంగా మెడికవర్ ఆసుపత్రిలో ఉండే ఆర్థోపెడిక్, గుండె, కిడ్నీ సంబంధిత వ్యాధులకు హెల్త్ కార్డులపై చికిత్స చేయాలని యాజమాన్యం నిర్ణయించడం అభినందనీయమని అన్నారు. గత కార్యవర్గ సమావేశం అనంతరం చేపట్టిన కార్యకలాపాలపై రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ్‌నారాయణ నివేదిక సమర్పించారు. ఈ సమావేశంలో ఐజేయూ కార్యదర్శి నరేందర్ రెడ్డి, జాతీయ కార్యవర్గ సభ్యులు నగునూరి శేఖర్, టీయూడబ్ల్యూజే ఉప ప్రధాన కార్యదర్శి రాములు, ఉపాధ్యక్షులు బుర్ర సంపత్ కుమార్ గౌడ్, గాడిపల్లి మధు గౌడ్, ఫైసల్ అహ్మద్, రాష్ట్ర కార్యదర్శులు మధుగౌడ్, వరకాల యాదగిరి, శ్రీకాంత్ రెడ్డి, కోశాధికారి మోతే వెంకటరెడ్డితో పాటు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, ప్రత్యేక ఆహ్వానితులు హాజరయ్యారు. రాష్ట్ర కార్యవర్గ సమావేశాన్ని విజయవంతంగా నిర్వహించిన నాగర్‌కర్నూల్ జిల్లా శాఖను రాష్ట్ర కార్యవర్గం అభినందించింది.

ఆలయ భూముల కౌలుకు వేలం

అలంపూరు, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : అలంపూర్ జోగుళాంబ బాల బ్రహ్మేశ్వర స్వామి ఆలయ భూముల కౌలుకు సోమవారం వేలం పాట నిర్వహించారు. 34 సర్వే నెంబర్లలోని భూములకు 2025 నుంచి 2027 రెండు సంవత్సరాల కాల పరిమితికి దేవాదాయ శాఖ, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా సహాయ కమిషనర్ మదనేశ్వర్‌రెడ్డి పర్యవేక్షణలో వేలం నిర్వహించారు. మొత్తం 34 సర్వే నెంబర్లలో 28 సర్వే నెంబర్ల భూమికి మాత్రం రైతులు, కౌలు రైతులు గత సంవత్సరం కంటే హెచ్చు పాట పాడి కౌలుకు దక్కించుకున్నారు. దీని ద్వారా రూ. 39.59 లక్షల ఆదాయం వచ్చింది. మిగతా 6 సర్వే నంబర్లలోని భూమికి సరైన ధర రాలేదు. ఆ భూములకు వచ్చేనెల 2వ తేదీన వేలం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అదే విధంగా సూర్యనారాయణస్వామి ఆలయానికి చెందిన రెండు సర్వే నెంబర్లలోని భూమికి రూ. 6.77 లక్షల ఆదాయం వచ్చింది. ఈ భూములకు గతంలో రూ. 2.77 లక్షల ఆదాయం వచ్చినది. కాశీపురం ఆంజనేయ స్వామి ఆలయానికి చెందిన రెండు సర్వేనెంబర్లలోని భూమికి ఈ సంవత్సరం రూ. 2.11 లక్షల ఆదాయం రాగా, రెండేళ్ల క్రితం రూ.1.04 లక్షల ఆదాయం వచ్చిందని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ధర్మకర్తలు జగదీశ్వర్ రెడ్డి, వెంకటేశ్వర్లు, గోపాల్, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

గోడ కూలి వ్యక్తి మృతి

- ఆయన భార్యకు గాయాలు

కొత్తపల్లి, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : గోడ కూలి ఓ వ్యక్తి మృతి చెందాడు. ఆయన భార్యకు తీవ్ర గాయాలయ్యాయి. హైదరాబాద్‌లో జరిగిన ఈ సంఘటనపై స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నారాయణపేట జిల్లా, కొత్తపల్లి మండలంలోని భూనీడు గ్రామానికి చెందిన శివనోళ్ల రాంరెడ్డి (50) రాధ దంపతులు ఉపాధి కోసం హైదరాబాద్‌కు చాలా ఏళ్ల క్రితం వలస వెళ్లారు. అక్కడ కూలీ పనులు చేస్తూ జీవనం గడుపుతున్నారు. ఈ క్రమంలో ఆదివారం వారు అడ్డా నుంచి కూలికి వెళ్లారు. అక్కడ పాత గోడను కూల్చుతుండగా అది ఒక్కసారిగా కూలిపోయింది. దీంతో రాంరెడ్డి, రాధ తీవ్రంగా గాయపడ్డారు. వారిని మెహిదీపట్నంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ రాంరెడ్డి మృతి చెందాడు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకొచ్చిన బంధువులు సోమవారం అంత్యక్రియలు నిర్వహించారు.

శిలాఫలకాలకే పరిమితమైన చేనేత పార్కు

(5వ పేజీ తరువాయి)

శిక్షణ ఇవ్వడంతో హ్యాండ్లూమ్, పవర్‌లూమ్‌ల క్లస్టర్‌లను ఏర్పాటు చేయాలని అప్పటి మంత్రిగా ఉన్న డీకే అరుణ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డితో 2008 అక్టోబరు 5న శంకుస్థాపన చేయించారు. వెంటనే హద్దులు నిర్ణయించి కంచె ఏర్పాటు కోసం రూ.50లక్షల నిధులు విడుదల చేయించారు. ఆ తర్వాత రాజశేఖర్‌రెడ్డి మరణం, రోశయ్య, కిరణ్‌కుమార్‌రెడ్డిల ప్రభుత్వం ఏర్పడటం తెలంగాణ ఉద్యమం తీవ్రతరం కావడంతో పాలకులు దీనిని పట్టించుకోలేదు. 2018, జనవరి 31న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి చేనేత జౌళిశాఖ మంత్రిగా ఉన్న కేటీఆర్‌ను గద్వాలకు పిలిపించి రెండోసారి శంకుస్థాపన చేయించారు.

రూ.52 కోట్లతో ప్రతిపాదనలు..

కేటీఆర్ శంకుస్థాపనతో అధికారులు పార్కులో 10 ఎకరాలను అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు తయారు చేశారు. హ్యాండ్లూమ్, పవర్‌లూమ్‌లకు కామన్ వర్క్ షెడ్, పరిపాలన భవనం, ప్రహరీ, తదితర వాటిని నిర్మించేందుకు 2022లో రూ. 52 కోట్లతో అంచనాలను తయారు చేసి మొదటి విడతగా రూ.21 కోట్లు అవసరం అవుతాయని ప్రభుత్వానికి డీపీఆర్‌ను పంపించారు. ఇందులో మాస్టర్ వీవర్స్ భాగస్వామ్యం ఉండాలనే ఉద్దేశ్యంతో ప్రాజెక్టు విలువలో 30శాతం భరించాలని, మిగిలింది ప్రభుత్వం భరిస్తుందని సూచించారు. లేదంటే ప్రభుత్వమే భరించి బహిరంగ వేలం ద్వారా మాస్టర్ వీవర్స్‌కు అప్పగిస్తుందనే రెండు ప్రతిపాదనలతో డీపీఆర్‌ను తయారు చేసి ప్రభుత్వానికి నివేదించారు. ప్రస్తుతం ప్రభుత్వం మారింది. ప్రతిపాదించిన డీపీఆర్‌ను ఈ ప్రభుత్వం ఇప్పటిదాకా ఆమోదించలేదు. దీనిపై ప్రజాప్రతినిధులు ప్రభుత్వంతో మాట్లాడితే కదిలిక వస్తుందేమోనని కార్మికులు ఎదురుచూస్తున్నారు.



గద్వాల చేనేత పార్కు

ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాం..



గత ప్రభుత్వంలో తయారు చేసిన డీపీఆర్ గురించి మంత్రి దృష్టికి తీసుకువెళ్లాం.. ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతులు రాలేదు. చేనేత పార్కులో మట్టి, రాళ్లను తరలిస్తున్నారని ఫిర్యాదులు వచ్చాయి. దీంతో పార్కును రక్షించేందుకు చుట్టూ ప్రహరీ నిర్మించాలని రూ.2.40కోట్లతో ప్రతిపాదనలు పంపించాం. నిధులు మంజూరు అయిన వెంటనే నిర్మాణ పనులు చేపడుతాం.

- గోవిందయ్య, ఏడీ చేనేత జౌళిశాఖ గద్వాల

మట్టిమాఫియా చేతుల్లోకి పార్కు స్థలం

చాలా ఏళ్ల నుంచి పార్కు స్థలం ఖాళీగా ఉండటంతో అక్రమార్కుల కన్నుదానిపై పడింది. మట్టిమాఫియా ఈ స్థలంలో పెద్దపెద్ద గుంతలు చేసి మట్టిని తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. దీనిపై చాలాసార్లు చేనేత అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు మట్టి తరలిస్తున్న వాహనాలను పట్టుకొని జరిమానా వేశారు. అయినా రాత్రి సయంలో మట్టి, రాళ్లను తరలిస్తున్నారు. దీంతో ఈ స్థలానికి ప్రహరీ నిర్మించాలని చేనేత సంఘం నాయకులు కోరుతూ ఇంజనీరింగ్ అధికారులతో ప్రతిపాదనలు తయారు చేయించారు. 47.25ఎకరాల చుట్టూ ప్రహరీ నిర్మించడానికి రూ.2.40కోట్లు అవసరం అవుతాయని నివేదించారు. ప్రస్తుతం ప్రభుత్వానికి ప్రతిపాదనలు వెళ్లాయి. ప్రభుత్వం ఆమోదిస్తేనే చేనేత పార్కుకు రక్షణ ఏర్పడుతుందని చేనేత సంఘాల నాయకులు అభిప్రాయపడుతున్నారు.

బైకు అదుపు తప్పి దంపతులకు గాయాలు

ఊర్కొండ, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : బైకు అదుపు తప్పి దంపతులకు గాయాలైన సంఘటన సోమవారం నాగర్‌కర్నూల్ జిల్లా ఊర్కొండ మండలంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... కల్వకుర్తి మండలం రాచూర్ గ్రామానికి చెందిన ప్రహ్లాద్ దంపతులు గ్రామం నుంచి కల్వకుర్తి-జడ్చర్ల ప్రధాన రహదారి గుండా బైకుపై వెళుతుండగా ముచ్చర్లపల్లి గ్రామ శివారులో బైకు అదుపు తప్పి కిందపడిపోయారు. దాంతో బైకుపై ప్రయాణిస్తున్న దంపతులకు గాయాలు కాగా స్థానికులు 108 వాహనంలో కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం కల్వకుర్తి పట్టణంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

బాలిక అదృశ్యం

నాగర్‌కర్నూల్ క్రైం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : మైనర్ బాలిక అదృశ్యం కావడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ గోవర్ధన్ తెలిపారు. వివరాల ప్రకారం... నాగర్‌కర్నూల్ మండలంలోని ఒక గ్రామానికి చెందిన బాలిక ఆదివారం సాయంత్రం కిరాణ షాపులో సామగ్రి తేవడానికి తల్లి పంపగా ఇంటికి తిరిగి రాకపోవడంతో చుట్టు పక్కల బంధువుల వద్ద, ఎక్కడ వెతికినా ఆచూకీ లభించకపోవడంతో సోమవారం నాగర్‌కర్నూల్ పోలీస్ స్టేషన్‌లో బాలిక తల్లి ఫిర్యాదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. ఈ సంఘటనపై దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

భూభారతి చట్టం రైతులకు చుట్టం

- నాగర్‌కర్నూల్‌ఎంపీ డాక్టర్ మల్లురవి



భూభారతి అవగాహన చట్టం కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీ డాక్టర్ మల్లురవి

అలంపూరు, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : భూభారతి చట్టం రైతులకు చుట్టమని నాగర్‌కర్నూలు ఎంపీ డాక్టర్ మల్లురవి అన్నారు. భూభారతి చట్టంపై జోగుళాంబ గద్వాల జిల్లా అలంపూరు పట్టణంలోని బీఆర్ఎస్ ఫంక్షన్ హాల్లో సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి ఆయనతో పాటు, అలంపూరు ఎమ్మెల్యే విజయుడు, కలెక్టర్ సంతోష్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశ పెట్టిన భూభారతి చట్టం భూవివాదాల పరిష్కారానికి ఎంతగానో దోహదపడుతుందన్నారు. రైతుల పక్షపాతిగా వారి సమస్యలను పరిష్కరించేందుకు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ చట్టాన్ని అమలు చేస్తున్నారని చెప్పారు. గతంలో ఉన్న ధరణి పోర్టల్‌తో రైతులు చాలా ఇబ్బందులు పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యాలయాల చుట్టూ రైతులు కాళ్లు అరిగేలా తిరిగారని, అధికారులు కూడా నిస్సహాయంగా ఉండిపోయారని గుర్తు చేశారు. ప్రభుత్వం అన్ని కోణాల్లో మేధోమధనం చేసిన తర్వాత భూభారతి చట్టానికి రూపకల్పన చేసినట్లు తెలిపారు. ప్రతీ వారం కలెక్టర్, తహసీల్దార్ సహా సంబంధిత అధికారులతో సమీక్షలు నిర్వహించి భూ సమస్యల పరిష్కారాన్ని స్వయంగా పర్యవేక్షిస్తామని తెలిపారు. అనంతరం కలెక్టర్ సంతోష్ మాట్లాడుతూ భూ వివాదాలను పరిష్కరించి, భూములపై రైతులకు పూర్తి హక్కులు కల్పించేందుకే ప్రభుత్వం భూభారతి చట్టాన్ని ప్రవేశ పెట్టిందని తెలిపారు. ధరణి స్థానంలో కొత్తగా అమలు చేయనున్న భూ భారతి చట్టంలో 23 సెక్షన్లు, 18 నిబంధనలు ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ, ఆర్డీవో శ్రీనివాసరావు, డీసీసీబీ చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నీటి శ్రీనివాసులు, అలంపూరు మార్కెట్ యార్డు చైర్మన్ దొడ్డప్ప, టెలికాం అడ్వయిజరీ సభ్యుడు ఇస్మాయిల్, వాల్మీకి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మద్దిలేటి, తహసీల్దార్ మంజుల, మునిసిపల్ కమిషనర్ చంద్రశేఖర్ రావు పాల్గొన్నారు.

అమ్మవారికి ప్రత్యేక పూజలు

అవగాహన సదస్సుకు ముందు ఎంపీ డాక్టర్ మల్లురవి జోగుళాంబ, బాల బ్రహ్మేశ్వర స్వామి వారి ఆలయాలను దర్శించుకున్నారు. వారికి ఈవో పురేందర్ కుమార్, ఆలయ చైర్మెన్ కొంకల నాగేశ్వర్ రెడ్డి పూర్ణకుంభ స్వాగతం పలికారు. స్వామి, అమ్మవార్ల ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అభివృద్ధి పనులపై హైలెవెల్ కమిటీ ఆధ్వర్యంలో ఎంపీకి వినతిపత్రం ఇచ్చారు.

కొరియోగ్రాఫర్‌గా మద్దూరు యువతి

- శివశంభో చిత్రానికి కృష్ణవేణి నృత్య దర్శకత్వం
- ఈనెల 25న సినిమా విడుదల



నృత్య కళాకారులతో డాక్టర్ కృష్ణవేణి వెంకట్

మద్దూర్, ఏప్రిల్ 21 : నారాయణపేట జిల్లా, మద్దూరు మండలానికి చెందిన నృత్య కళా కారిణి, శిక్షకురాలు కృష్ణవేణికి సినిమాలో అవకాశం లభించింది. 'శివశంభో' చిత్రంలోని పాటలకు ఆమె నృత్య దర్శకత్వం వహిస్తున్నారు. మండలంలోని పల్లెర్ల గ్రామానికి చెందిన దాసరి పద్మమ్మ, చెన్నయ్య దంపతులకు మార్తె కృష్ణవేణికి చిన్నప్పటి నుంచే భరతనాట్యంపై ఆసక్తి కలిగింది. తండ్రి ప్రోత్సాహంతో నృత్యంలో రాణించిన ఆమె హైదరాబాద్‌లో 'తాండవ' డ్యాన్స్ అకాడమీ ఏర్పాటు చేశా రు. గత 10 సంవత్సరాలుగా ఎంతో మంది చిన్నారులకు నృత్య శిక్షణ ఇస్తున్నారు. ఈ క్రమంలో ఆమెకు ఓ సినిమాలో కొరియోగ్రాఫర్‌గా అవకాశం లభించింది. డైరెక్టర్ నర్సింగ్ దర్శకత్వంలో, నిర్మాత బొజ్జ రాజగోపాల్ సారథ్యంలో నిర్మిస్తున్న శివశంభో చిత్రానికి ఆమె నృత్య దర్శకత్వం వహి స్తున్నారు. ఈ చిత్రంలో సుమన్, టార్జాన్, తనికెళ్ల భరణి, రంగరాజన్ తదితరులు నటిస్తున్నారు. భర్త వెంకట్‌తో పాటు తల్లిదండ్రులు, అత్తామామల ప్రోత్సాహంతో ఈ అవకాశం లభించిందని కృష్ణవేణి తెలిపారు. ఈనెల 25న సినిమా విడుదల కానున్నదని, మండలవాసులు ఆదరించి చిత్రాన్ని విజయవంతం చేయా లని కోరారు.

చికిత్స పొందుతూ ఇద్దరి మృతి

ఊర్కొండ, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. నాగర్‌కర్నూల్ జిల్లా ఊర్కొండ మండలం మాదారం గ్రామానికి చెందిన అంజనేయులు (50) తన ఇంట్లో ఈ నెల 11న కాలు జారి పడ్డాడని హెడ్ కానిస్టేబుల్ దండోత్కర్ వెంకోజీ అన్నారు. దాంతో గాయాలు కావడంతో కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా సోమవారం మృతి చెందాడని తెలిపారు. మృతుడి కుమారుడు రాఘవేందర్ సోమవారం ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ పేర్కొన్నారు.

జడ్చర్ల, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : జడ్చర్ల మం డలం మాచారం గ్రామానికి చెందిన పానుగ ంటి అనంత(40) చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందింది. సీఐ కమలాకర్ తెలిపిన వివరాల మేరకు.. పానుగంటి అనంత ఈ నెల 13న పనినిమిత్తం మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్లకు వచ్చింది. తిరిగి రాత్రి మాచారం వెళ్లేందుకు పట్టణంలోని నేతాజీచౌ రస్తాలో ఆటో ఎక్కింది. మార్గమధ్యలో వేంకటేశ్వ రస్వామి ఆలయ సమీపంలో ఆటోను వెనుక నుంచి గుర్తుతెలియని వాహనం ఢీ కొట్టింది. ఈ ఘటనలో అనంత, ఆటో డ్రైవర్‌కు గాయాలయ్యాయి. చికిత్స కోసం జిల్లా జనరల్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం తెల్లవారుజామున మృతిచెందింది. అనిత బావ పానుగంటి చెన్నయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ కమలాకర్ తెలిపారు.

అ'కాలం' కన్నీర్ర

(5వ పేజీ తరువాయి)

నీటి ఎద్దడితో, ప్రస్తుతం కురుస్తున్న అకాల వర్షాలతో ఉమ్మడి పాలమూరు జిల్లాలో 9,409 ఎకరాల్లో పంట నష్టం జరిగింది. ఈ విస్తీర్ణం మొత్తంలో 33 శాతం కంటే ఎక్కువగానే పంట నష్టం జరిగిందని వ్యవసాయశాఖ అధికారుల అంచనాలు చెబుతున్నాయి. జూరాల, నెట్టెంపాడు, కల్వకుర్తి, కోయిల్‌సాగర్, ఆర్డీఎస్ వంటి నీటి వనరుల కింద యాసంగిలో ఉమ్మడి జిల్లాలో భారీగా పంటలు సాగు చేశారు. ఇవి కాకుండా బోరుబావుల కింద సాగును కలుపుకుంటే.. ఉమ్మడి జిల్లాలో 10.92 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగయ్యాయి. గతేడాది యాసంగితో పోల్చుకుంటే 1.91 లక్షల విస్తీర్ణంలో పంటల సాగు పెరిగింది. 2023-2024 యాసంగిలో వర్షాభావం కారణంగా ప్రాజెక్టుల్లో నీరు లేక పంటలు ఎండిపోయాయి. కానీ ఈ ఏడాది సమృద్ధిగా వర్షాలు కురిశాయి. కానీ సరైన ప్రణాళిక లేకపోవడం, యాసంగి అవసరాలను గమనించకుండా ప్రజాప్రతినిధుల ఒత్తిడితో అనువు కాని సమయంలో కూడా ఎక్కువ నీరు దిగువకు విడుదల చేసుకోవడం వంటి కారణాలతో పంటలు ఎండిపోయాయి. వరి సాగు అధికంగా పెరగడంతో బోరుబావులకు భూగర్భజలాలు అందని పరిస్థితులు నెలకొన్నాయి. ఈ క్రమంలోనే చాలాచోట్ల పంటలను పశువులకు వదిలేయడం, నిప్పు పెట్టడం చేశారు. అయితే అన్ని జిల్లాల్లో నీటి ఎద్దడి కారణంగా పంటలు ఎండిపోయినప్పటికీ.. వ్యవసాయ అధికారులు మాత్రం చాలా జిల్లాల్లో తమ పరిధిలో నీటి ఎద్దడితో ఎలాంటి పంటలు ఎండిపోలేదని చెబుతుండటం గమనార్హం. వాటిని అధికారులు ఎందుకు గుర్తించలేదో అర్థం కాని పరిస్థితులు ఉన్నాయి.

వరికే ప్రధాన నష్టం..

ఉమ్మడి జిల్లాలో సాగునీటి వనరుల లభ్యత పెరిగిన తర్వాత.. వరి సాగు విస్తీర్ణం కూడా గణనీయంగా పెరిగింది. ఆరుతడి పంటలను వదిలేసి రైతులు వరిపైనే ఆధారపడుతున్నారు. దాంతో ప్రకృతి వైపరీత్యాలు సంభవిస్తే వరి పంటకు ఎక్కువ నష్టం వాటిల్లుతోంది. ప్రస్తుతం నీటి ఎద్దడి, అకాల వర్షాల కారణంగా ఉమ్మడి జిల్లాలో 9,409 ఎకరాల్లో పంట నష్టం జరుగగా.. 6,078 ఎకరాల్లో వరి పంటకే నష్టం వాటిల్లడం గమనార్హం. ఇవి కాకుండా భారీగా వీస్తున్న గాలులతో కోత దశకు వస్తున్న మామిడి కాయలు నేల రాలుతోంది. వనపర్తి జిల్లా వీపనగండ్ల, చిన్నంబావి, నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్, పెద్దకొత్తపల్లి, మహబూబ్‌నగర్ జిల్లాలోని పలు మండలాల్లో మామిడి తోటలు ఎక్కువగా ఉన్నాయి. ఇప్పుడే కాయలు పక్వానికి వస్తుండగా, గాలులతో రాలుతున్నాయి. దీనివల్ల వాటికి ధర వచ్చే అవకాశం లేదు. ఈ నెలాఖరు తర్వాత ఉమ్మడి జిల్లా పరిధిలో మామిడి కోతలు పెరుగుతాయి. ఇప్పటికే ఆశించిన మేర దిగుబడి రాకపోవడం, ధర తక్కువగా వస్తుండటం, పెట్టుబడి ఏటికేడు పెరుగుతోంది. దాంతో తోటలను గుత్తకు తీసుకున్న వారికి నష్టాలే మిగులుతున్నాయి. ప్రస్తుతం అకాల వర్షాలతో ఉన్న కాస్త ఆశలు కూడా ఆవిరవుతున్నాయి. ప్రభుత్వం త్వరగా నష్టం అంచనా వేసి, పరిహారం అందజేయాలని రైతులు కోరుతున్నారు.

25 నుంచి రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలు



సమావేశంలో మాట్లాడుతున్న షూటింగ్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు సత్య ఆంజనేయులు

మక్తల్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : నారాయణపేట జిల్లా, ఊట్కూరు మండలం, బిజ్వార్‌లో ఈ నెల 25 నుంచి 27 వరకు షూటింగ్‌బాల్ రాష్ట్ర స్థాయి పోటీలు నిర్వహించనున్నట్లు అసోసియేషన్ అధ్యక్షుడు సత్య ఆంజనేయులు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ ఐలయ్య తెలిపారు. మక్తల్ పట్టణంలోని మినీ స్టేడియంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. గ్రామంలోని అంబాత్రయ క్షేత్రం వద్ద నిర్వహించనున్న ఈ పోటీలో రాష్ట్రంలోని 33 జిల్లాల నుంచి 600 మంది క్రీడాకారులు పాల్గొననున్నట్లు తెలిపారు. మూడు రోజుల పాటు కొనసాగనున్న ఈ పోటీలకు ఆదిత్య పరాశ్రీ స్వామి పూర్తి సహకారం అందిస్తున్నట్లు చెప్పారు. పోటీల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు వచ్చేనెల 9 నుంచి 11 వరకు చెన్నైలో నిర్వహించనున్న జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో షూటింగ్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గోపాలం, సైక్లింగ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు థాన్‌సింగ్, జిల్లా ప్రధాన కార్యదర్శి రమేశ్‌కుమార్ పాల్గొన్నారు.

బాలిక నిర్బంధం

- యువకుడిపై పోక్సో కేసు

గద్వాల, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లాలోని ఓ మండలానికి చెందిన బాలికను నిర్బంధించి ఇబ్బందులకు గురిచేసిన యువకుడిపై పోక్సో కేసు నమోదయ్యింది. ఐదు రోజుల క్రితం జరిగిన ఈ సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఇటిక్యాల మండలంలో మిర్చి పొలాల్లో పనుల కోసం ఇతర ప్రాంతాల నుంచి కూలీ పనులకు వచ్చే వారు. ఈ క్రమంలో ఓ బాలికతో ఓ మండలానికి చెందిన యువకుడు సన్నిహితంగా మెలిగాడు. మాయమాటలు చెప్పి నిర్బంధించి ఇబ్బందులకు గురి చేశాడు. విషయం తెలుసుకున్న బాలిక బంధువులు యువకుడికి దేహశుద్ధి చేసి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై ఎస్‌ఐని వివరణ కోరగా నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేశామని తెలిపారు.



నారాయణపేటలో కారుపై పడిన వేపచెట్టు కొమ్మ



మహమ్మదాబాద్‌లో తడిసిన ధాన్యం



పేట వ్యవసాయ మార్కెట్ యార్డులో వర్షానికి కొట్టుకోపోతున్న ధాన్యాన్ని కుప్పగా పోస్తున్న రైతు



పేట ఆర్డీవో కార్యాలయం దగ్గర విరిగి పడిన 11 కేవీ విద్యుత్ స్తంభం

వర్ష బీభత్సం

- నారాయణపేట జిల్లాలో ఈదురుగాలులతో కూడిన భారీ వాన
- విరిగిపోయిన చెట్లు.. విద్యుత్ స్తంభాలు
- ఎగిరిపోయిన పైకప్పు రేకులు
- మార్కెట్‌యార్డు, కల్లాల్లో తడిసిన ధాన్యం
- నిలిచిన విద్యుత్ సరఫరా

నారాయణపేట, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట జిల్లాలో సోమవారం సాయంత్రం ఈదురు గాలులతో కూడిన వర్షం బీభత్సం సృష్టించింది. బలమైన గాలులకు చెట్లు, విద్యుత్ స్తంభాలు విరిగి పడగా, మార్కెట్‌యార్డులో ధాన్యం తడిసిపోయింది. నారాయణపేట-మహబూబ్‌నగర్ రోడ్డు డివైడర్ మధ్యలో ఉన్న మూడు వీధి దీపాల స్తంభాలు విరిగిపడ్డాయి. ఆర్డీవో కార్యాలయం దగ్గర 11 కేవీ విద్యుత్ స్తంభం, చిన్న పిల్లల ఆస్పత్రి పాత బస్టాండ్ వద్ద మూడు స్తంభాలు, జిల్లా పరిషత్ కార్యాలయం వెనుక మరో మూడు స్తంభాలు విరిగిపోయాయి. గాంధీనగర్‌తో పాటు పట్టణంలోని పలు ప్రాంతాల్లో చెట్లు నేలవాలాయి. దాంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయి, ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. గాలులకు పలు చోట్ల రేకులు ఎగిరిపోయాయి. నారాయణపేట వ్యవసాయ మార్కెట్ యార్డుకు దాదాపు ఐదువేల బస్తాల వరి ధాన్యం విక్రయానికి తేగా, ఈదురు గాలులకు ధాన్యంపై కప్పిన టార్పాలిన్ కవర్లు ఎగిరిపోయి ధాన్యం నీటిలో కొట్టుకుపోయింది. అదే విధంగా బస్తాల్లో నింపిన 500 బ్యాగుల ధాన్యం కూడా త డిసిపోయింది. వ్యాపారులకు సంబంధించి మరో 500 బస్తాల ధాన్యం తడిసింది. మార్కెట్ యార్డు షెడ్డు రేకులు కొన్ని ఎగిరిపోయాయి. నారాయణపేట పట్టణంలోని శాసన్‌పల్లి రూట్‌లో పలు ప్రహరీలు నేలకొరిగాయి. శ్రీనివాస్ కాలనీ, గాంధీనగర్‌లో పలు చోట్ల చెట్లు విరిగిపడ్డాయి. మామిడి కాయలు రాలిపోయాయి.

కల్లాలో తడిసిన ధాన్యం

మహమ్మదాబాద్(ఆంధ్రజ్యోతి): అకాల వర్షానికి మహమ్మదాబాద్ మండలంలో సోమవారం ధాన్యం తడిసిపోయింది. వెంకట్‌రెడ్డిపల్లి, మహమ్మదాబాద్, మొకర్లబాద్, జూలపల్లి తదితర గ్రామాల్లో వడగళ్ల వర్షం పడటంతో కల్లాల్లో ఆరబోసిన ధాన్యం తడిసింది. మామిడి కాయలు నేల రాలాయి.

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో ప్రధానోపాధ్యాయుడి మృతి

» అదుపు తప్పి కల్వర్టును ఢీకొన్న కారు

» ఉద్యోగ విరమణకు కొద్ది రోజుల ముందు దుర్ఘటన



పాపిశెట్టి శ్రీనివాసులు (ఫైల్)

వెల్దండ/ తెలకపల్లి, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : ఉద్యోగ విరమణకు మరి కొద్ది రోజులు మాత్రమే ఉన్నాయి. తోటి ఉపాధ్యాయులు ఈ నెల 17న ఆయనకు వీడ్కోలు సభ కూడా నిర్వహించారు. శేష జీవితాన్ని కుటుంబంతో ఆనందంగా గడపాలని అందరూ ఆకాంక్షించారు. కానీ ఆ ప్రధానోపాధ్యాయుడిని మృత్యువు వెంటాడింది. కుటుంబసభ్యులు, స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నాగర్‌కర్నూల్ జిల్లా, అచ్చంపేటకు చెందిన పాపిశెట్టి శ్రీనివాసులు (61) హైదరాబాద్‌లోని కర్మన్‌ఘాట్‌లో ఉంటూ, తెల్కపల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గెజిటెడ్ ప్రధానోపాధ్యాయు డిగా విధులు నిర్వర్తిస్తున్నారు. ఈ నెలాఖరున ఉద్యోగ విరమణ చేయాల్సి ఉన్నది. మరో రెండు రోజుల్లో పాఠశాలలు ముగియనున్నాయి. ఈ క్రమంలో శ్రీనివాసులు సోమవారం ఉదయం కారులో హైదరాబాద్ నుంచి పాఠశాలకు బయలుదేరారు. హైదరాబాద్ - శ్రీశైలం ప్రధాన రహదారిపై, పెద్దాపూర్ సమీపంలో అదుపుతప్పిన కారు పక్కనే ఉన్న కల్వర్టును ఢీకొన్నది. దీంతో తీవ్రంగా గాయపడిన అతడిని స్థానికులు అంబులెన్సులో కల్వకుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శ్రీని వాసులు మృతి చెందారు. అతడికి భార్య కమల, కుమార్తె ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ కురుమూర్తి తెలిపారు. నాగర్‌కర్నూల్ డీఈవో రమేశ్, ఉపాధ్యాయులు ఆసుపత్రికి చేరుకుని నివాళి అర్పించారు.

ఉపాధి హామీ పని కల్పించాలని కూలీల ఆందోళన



ఉపాధి హామీ పని కల్పించాలని నిరసన చేస్తున్న కూలీలు

చిన్నంబావి ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): వనపర్తి జిల్లా చిన్నంబావి మండల పరిధిలోని బెక్కెం గ్రామంలో గ్రామపంచాయతీ కార్యాలయం ముందు కూలీలు ఆందోళనకు దిగారు. కూలీ పనిలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని తమకు ఉపాధి కల్పించాలని కార్యాలయాన్ని నిర్బంధించారు. వెంటనే తమకు కూలి పని కల్పించాలని అధికారులను కోరారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు కూలీలకు మద్దతు తెలిపారు. కూలీలు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

బాలికపై లైంగికదాడి

» నిందితుడికి రిమాండ్

మద్దూర్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : ప్రేమ పేరుతో బాలికను నమ్మించి లైంగిక దాడికి పాల్పడిన నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ విజయకుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. నారాయణపేట జిల్లా, దామరగిద్ద మండలంలోని ఓ గ్రామానికి చెందిన బి.శ్రీనివాస్ అనే యువకుడు 17 ఏళ్ల బాలికను ప్రేమ పేరుతో నమ్మించాడు. మాయమాటలు చెప్పి ఈనెల 10న ద్విచక్రవాహనంపై హైదరాబాద్‌కు తీసుకెళ్లాడు. అక్కడ ఒక అద్దె ఇంట్లో ఉంచి అత్యాచారానికి పాల్పడ్డాడు. మరుసటి రోజు మద్దూరు ఆర్టీసీ బస్టాండ్‌లో వదిలి వెళ్లిపోయాడు. ఈ విషయంపై బాధితురాలి తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేసి దర్యాప్తు చేపట్టారు. పరారీలో ఉన్న నిందితుడిని అరెస్ట్ చేసి, సోమవారం కోస్గీ కోర్టులో ప్రవేశపెట్టారు. అతడికి 14 రోజుల రిమాండ్ విధిస్తూ న్యాయాధికారి ఉత్తర్వులు జారీ చేశారు. అనంతరం నిందితుడిని మహబూబ్‌నగర్ జైలుకు తరలించినట్లు కోస్గీ సీఐ సైదులు, మద్దూరు ఎస్‌ఐ విజయకుమార్ తెలిపారు.

ఆటో, బైక్ ఢీ

- ఇద్దరికి గాయాలు



ఢీకొని రోడ్డుపై పడిపోయిన ఆటో, ద్విచక్ర వాహనం

వనపర్తి రూరల్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : ఆటో, ద్విచక్రవాహనం ఎదురెదురుగా వస్తూ ఢీకొనడంతో ఇద్దరు గాయపడ్డారు. వనపర్తి జిల్లా, వనపర్తి మండల పరిధిలోని చిట్యాల శివారులో సోమవారం ఈ సంఘటన జరిగింది. స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. వనపర్తి పట్టణానికి చెందిన శివ తన స్నేహితులను ఆటోలో ఎక్కించుకొని చిమనగుంటపల్లి గ్రామానికి బయలుదేరాడు. చిట్యాల శివారులో ఆటో అదుపుతప్పి ఎదురుగా వస్తున్న ద్విచక్రవాహనాన్ని ఢీకొన్నది. ప్రమాదంలో ద్విచక్రవాహనం నడుపుతున్న చెన్నయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. ఆటో డ్రైవర్ శివ ఎడమ చేతికి గాయమైంది. స్థానికులు వారిని జిల్లా ఆసుపత్రికి తరలించారు.

ఇసుక డంపుల సీజ్



డంపు చేసిన ఇసుకను పరిశీలిస్తున్న తహసీల్దార్ వెంకటేశ్

కృష్ణ/ ఖిల్లా ఘణపురం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : నారాయణపేట, వనపర్తి జిల్లాల్లో అక్రమంగా ఏర్పాటు చేసిన ఇసుక డంపులను అధికారులు సీజ్ చేశారు. నారాయణపేట జిల్లా, కృష్ణా మండల పరిధిలోని మూడుమల్ గ్రామ శివారులోని కృష్ణానది వద్ద డంపు చేసిన 12 టిప్పర్ల ఇసుకను సీజ్ చేసినట్లు తహసీల్దార్ వెంకటేశ్ తెలిపారు. అనుమతి లేకుండా కొందరు ఎక్స్‌కవేటర్ల ద్వారా నదిలో ఆదివారం అర్ధరాత్రి తవ్వకాలు జరిపి ఇసుకను ట్రాక్టర్లతో తరలించి నది ఒడ్డున డంప్ చేశారు. సమాచారం అందుకున్న అధికారులు సోమవారం ఉదయం దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా దాదాపు 12 టిప్పర్ల ఇసుకను సీజ్ చేసినట్లు అధికారులు తెలిపారు. అలాగే వనపర్తి జిల్లా ఖిల్లాఘణపురం మండల కేంద్రంలోని శివారులోని పిల్లి వాగు వద్ద అక్రమంగా నిల్వ చేసిన 105 ట్రాక్టర్ల ఇసుక డంపును సోమవారం సీజ్ చేసినట్లు తహసీల్దార్ సుగుణ తెలిపారు.

మహిళపై అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తికి మూడేళ్ల జైలు శిక్ష

చిన్నంబావి, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): ఓ మహిళపై అసభ్యంగా ప్రవర్తించిన వనపర్తి జిల్లా, చిన్నంబావి మండల కేంద్రానికి చెందిన వ్యక్తికి మూడేళ్ల జైలు శిక్ష విధించినట్లు సోమవారం ఎస్సై జగన్‌మోహన్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం... మండల పరిధిలోని చిన్నమారు గ్రామానికి చెందిన మహిళపై అసభ్యంగా ప్రవర్తించిన కావలి బాబు అనే వ్యక్తిపై 2018వ సంవత్సరంలో కేసు నమోద చేయడం జరిగింది. ఆ కేసు కోర్టులో ట్రయల్ నడిచి అతనికి వనపర్తి సెకండ్ అడిషనల్ జ్యూడీషియల్ ఫస్ట్ క్లాస్ న్యాయాధికారి జానకి మూడు సంవత్సరాల జైలు శిక్ష, 1500 రూపాయల జరిమానా విధించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

అంతుచిక్కని ఆరుగురి ఆచూకీ

» షీర్ జోన్‌లో తవ్వకాలపై సందిగ్ధం

» కొనసాగుతున్న నీటి ఊట పంపింగ్



సొరంగం పైకప్పు నుంచి ఉబికి వస్తున్న నీటి ఊట

దోమలపెంట, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : శ్రీశైలం ఎడమ గట్టు సొరంగం దుర్ఘటన జరిగి సోమవారానికి 59 రోజులు గడిచింది. టన్నెల్లో శిథిలాల తవ్వకాలు రెండు రోజుల క్రితమే పూర్తయ్యాయి. బయటకు తరలింపు చివరి దశకు చేరింది. ప్రమాదం జరిగిన నాటి నుంచి నేటి వరకు రెస్క్యూ బృందాల ఆధ్వర్యంలో సహాయక చర్యలు కొనసాగుతూనే ఉన్నాయి. అయినా ఇప్పటి వరకు అందులో చిక్కుకుపోయిన ఆరుగురు కార్మికుల ఆచూకీ మాత్రం లభించలేదు. షీర్ జోన్‌లో తవ్వకాలు జరిపితే తప్ప వారిని గుర్తించడం కష్టంకాగా, శిథిలాలతో నిండుకున్న 43 మీటర్లలో తవ్వకాలు జరిపే సాహసం చేస్తారా? లేదా ఆ ప్రాంతాన్ని పూర్తిగా మూసివేస్తారా అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. కాగా శిథిలాల కింద చిక్కుకుపోయిన వారి ఆచూకీ లభించకపోతే బాధిత కుటుంబాలకు జీవితాంతం తీరని శోకం మిగులుతుందని రెస్క్యూ బృందాల సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఈనెల 24 వరకు శిథిలాల తరలింపు

మిగిలిన శిథిలాలను ఈ నెల 24 వరకు తరలించి, సొరంగాన్ని శుభ్రం చేసేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ప్రమాద ఘటన జరిగిన ఫిబ్రవరి 22 నుంచి నేటి వరకు రెస్క్యూ బృందాల ఆధ్వర్యంలో తవ్వకాలు కొనసాగుతున్నాయి. సహాయక చర్యల్లో దేశవ్యాప్తంగా ఉన్న రెస్క్యూ బృందాలు, సంస్థలు ఎన్‌డీఆర్ఎఫ్, ఎస్‌డీఆర్ఎఫ్, ఎన్‌జీఆర్ఐ, ఎస్ఆర్ఎస్, ఎస్‌సీఎస్, ఎన్‌హెచ్ఐడీసీఎల్, ఆర్మీ, నేవీ, జీఎస్ఐ, జీఎస్ఐ, హైడ్రా, సింగరేణి, దక్షిణ మధ్య రైల్వే, ట్రాన్స్‌కో, స్నిపర్ డాగ్స్, క్యాడవర్ డాగ్స్, ర్యాట్‌హోల్ మైనర్స్, రెవెన్యూ, పంచాయతీరాజ్, జేపీ కంపనీ తదితర సంస్థలు పాల్గొంటున్నాయి. శిథిలాల కింద చిక్కుకుపోయిన 8 మందిలో మార్చి 9న టీబీఎం ఆపరేటర్ గురుప్రీత్ సింగ్, 25న ప్రాజెక్టు ఇంజనీర్ మనోజ్‌కుమార్‌ల మృతదేహాలను వెలికి తీసి వారి కుటుంబ సభ్యులకు అప్పగించారు. ప్రమాదకరంగా పరిగణించిన 43 మీటర్లు మినహా మిగిలిన ప్రాంత ంలోని శిథిలాలను రెస్క్యూ బృందాల సభ్యులు పూర్తిగా తిరుగతోడారు. మిగిలిన ఆరుగురు కార్మికుల ఆనవాళ్లు మాత్రం కన్పించలేదు. ఈ క్రమంలో బయట పడిన టన్నుల కొద్దీ బరువున్న బండరాళ్లు, టీబీఎంకు అను సంధానంగా ఉన్న ఇనప ప్లాట్‌ఫాం శకలాలను రెస్క్యూ బృందాలు ముక్కలుగా కత్తిరించి బయటకు తరలిస్తున్నారు. సొరంగంలోని బురద మట్టిని ఇప్పటికే పూర్తిగా తొలగించారు. మిగిలిన శిథిలాల తొలగింపు కొనసాగుతోంది. సహాయక చర్యల్లో సింగరేణి రెస్క్యూ టీం మేనేజర్లు రాజేందర్‌రెడ్డి, మాధవరావు, ఎన్‌డీఆర్ఎఫ్, హైడ్రా, రైల్వే, జీఎస్ఐ, ఇరిగేషన్, జేపీ కంపెనీ, ర్యాట్ హోల్ మైనర్స్, వివిధ శాఖ అధికారులు పాల్గొంటున్నారు.



తవ్వకాలలో వెలువడిన ఇనుప శిథిలాలను లోకో ట్రైన్‌పై వేస్తున్న రెస్క్యూ సిబ్బంది

అంబేడ్కర్‌ను అవమానించిన కాంగ్రెస్

» ఎస్సీ మోర్చా రాష్ట్ర ఇన్‌చార్జి, మాజీ ఎంపీ మునిస్వామి



జిల్లా సదస్సులో మాట్లాడుతున్న ఎస్సీ మోర్చా ఇన్‌చార్జి, మాజీ ఎంపీ మునిస్వామి

నారాయణపేట టౌన్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : రాజ్యాంగ నిర్మాత, బీఆర్ అంబేడ్కర్‌ను కాంగ్రెస్ పార్టీ ఆది నుంచి అడుగడుగునా అవమానించిందని ఎస్సీ మోర్చా రాష్ట్ర ఇన్‌చార్జి, ఎంపీ మునిస్వామి అన్నారు. కానీ ఆయనను బీజేపీ అభిమానించి, ఆరాధిస్తున్నదన్నారు. అంబేడ్కర్ జయంతి వారోత్సవాలను పురస్కరించుకొని సోమవారం నారాయణపేట జిల్లా కేంద్రంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు సత్యయాదవ్ అధ్యక్షతన నిర్వహించిన సదస్సుకు ఆయనతో పాటు, బీజేపీ రాష్ట్ర సీనియర్ నాయకుడు నాగురావు నామాజీ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ మునిస్వామి మాట్లాడుతూ అంబేడ్కర్ ఆశయాలను నేరవేరుస్తున్నది కేంద్రంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వమేనన్నారు. అంబేడ్కర్‌ను రాజ్యాంగ కమిటీ నియమించడం నెహ్రూకు ఇష్టం లేదని గుర్తు చేశారు. 60 ఏళ్ల పాలనలో అంబేడ్కర్‌కు భారత రత్న ఇవ్వకుండా అవమానించింది కాంగ్రెస్ పార్టీయే అన్నారు. 108 సార్లు రాజ్యాంగానికి సవరణలు తీసుకొచ్చి ఎమర్జెన్సీ, రాష్ట్రపతి పాలనకు ఉపయోగించుకుందని విమర్శించారు. కానీ బీజేపీ ప్రజా శ్రేయస్సు కోసం కొన్ని సవరణలు మాత్రమే చేసిందన్నారు. ప్రజలకు మరింత చేరువై రానున్న రోజుల్లో రాష్ట్రంలో బీజేపీని అధికారంలోకి తీసుకురావాలని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను అర్హులందరికీ అందేలా చూడాలన్నారు. ప్రతీ గ్రామంలో ఎస్సీ వాడల్లో పార్టీ ముఖ్య నాయకులు, బూత్ కమిటీల అధ్యక్షులతో సమావేశం ఏర్పాటు చేసి పార్టీ పటిష్టానికి కావల్సిన అంశాలను చర్చించాలని అన్నారు.

కార్యక్రమంలో నాయకులు బి.కొండయ్య, ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొప్పి బాషా, రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్.విజయ్‌కుమార్, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు బి.కృష్ణ, నర్సన్ గౌడ్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బంగ్లా లక్ష్మీకాంతరెడ్డి, బీజేపీ జిల్లా కార్యదర్శి సుజాత, బీజేపీ పట్టణ అధ్యక్షుడు పోషల్ వినోద్, మండల అధ్యక్షురాలు జ్యోతి సాయిబన్న, నాయకులు వివిధ మండలాల అధ్యక్షు లు పాల్గొన్నారు.

జీవిత చరిత్రలను అధ్యయనం చేయాలి

» పీయూ వీసీ ప్రొఫెసర్ జీఎన్ శ్రీనివాస్

» ఘనంగా మహనీయుల జయంతి వేడుకలు



సమావేశంలో మాట్లాడుతున్న పీయూ వీసీ ప్రొఫెసర్ జీఎన్ శ్రీనివాస్

పాలమూరు యూనివర్సిటీ, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : మహనీయుల జీవిత చరిత్రలను అధ్యయనం చేయాలని పాలమూరు యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ జీఎన్ శ్రీనివాస్ అన్నారు. మహనీయుల జయంతి వేడుకలను ఎస్సీ, ఎస్టీ, బీసీ సెల్ సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం పాలమూరు యూనివర్సిటీలోని గ్రంథాలయ ఆడిటోరియంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహనీయుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం వీసీ మాట్లాడుతూ మహనీయుల జీవితం, ఆచరణ, సేవలు, దేశం కోసం చేసిన త్యాగాలు మనందరికీ ప్రేరణగా నిలిచాయన్నారు. వారిని ఆదర్శంగా తీసుకొని యువత దృఢ సంకల్పంతో ముందుకు సాగాలన్నారు. వక్తలు ప్రొఫెసర్ కాశీ, ప్రొఫెసర్ రాజూనాయక్ మాట్లాడుతూ మహనీయుల ఆశయాలను కొనసాగించడం అందరి బాధ్యతన్నారు. వారు వేసిన పునాదులపై మానవీయ సమాజాన్ని నిర్మించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎస్పీ డి.జానకి, పీయూ రిజిస్ట్రార్ పి.రమేశ్‌బాబు, కన్వీనర్, కో-కన్వీనర్ డాక్టర్ కుమారస్వామి, డాక్టర్ ప్రవీణ, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

వక్ఫ్ 'సవరణ'ను వ్యతిరేకిస్తూ 26న బహిరంగ సభ

» హాజరు కానున్న ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ

» నిర్వహణ కమిటీ కన్వీనర్ మౌలానా నయీంకౌసర్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సభ నిర్వహణ కమిటీ కన్వీనర్ మౌలానా నయీంకౌసర్

మహబూబ్‌నగర్ అర్బన్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు ఆధ్వర్యంలో ఈ నెల 26న మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు సభ నిర్వహణ కమిటీ కన్వీనర్ మౌలానా నయీంకౌసర్ అన్నారు. పట్టణంలోని బాబామియా మసీదులో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వక్ఫ్ సవరణ చట్టానికి వ్యతిరేకంగా ఈ సభను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు అధ్యక్షుడు మౌలానా ఖాలీద్ సైఫుల్లా రహెమానీ అధ్యక్షతన పట్టణంలోని బాలుర కళాశాల మైదానంలో సాయంత్రం 7 గంటలకు ప్రారంభం అవుతుందని తెలిపారు. వక్ఫ్ సవరణ బిల్లును రద్దు చేసే వరకు పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. వక్ఫ్ సవరణల చట్టం పూర్తిగా రాజ్యాంగ విరుద్ధమని, అందుకు నిరసనగా దేశ వ్యాప్తంగా నిరసన సభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బాబాసాహెబ్ అంబేడ్కర్ ఆశయాలను కాలరాస్తూ, రాజ్యాంగాన్ని అవమానించడం సరికాదన్నారు. సభకు ముఖ్య అతిథిలుగా హైదరాబాద్ పార్లమెంట్ సభ్యుడు, ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ, మౌలానా అబుతాలిబ్ రహమానీ (కోలకతా)తో పాటు, ముస్లిం పర్సనల్ బోర్డు ప్రతినిధులు, మతపెద్దలు హాజరుకానున్నట్లు తెలిపారు. ఉమ్మడి జిల్లాలోని ముస్లింలు అధిక సంఖ్యలో పాల్గొని సభను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో మతపెద్దలు ఫక్రొద్దీన్, అజారుద్దీన్, అబ్దుల్‌హకీం, డీసీసీ ప్రధాన కార్యదర్శి సిరాజ్‌ఖాద్రీ, మౌలానా నూరుద్దీన్, జహీరుల్లాఖాన్, అబ్దుల్‌అజీజ్, మిల్లీ మహాజ్ కన్వీనర్ తఖీహస్సేన్, నాయకులు మజీద్, అబ్దుల్ నయీమ్, సాదుల్లా, అబ్దుల్‌మక్సూద్, సాధిక్ హుస్సేన్ పాల్గొన్నారు.

వేసవి సెలవుల్లో ఉపాధ్యాయులకు శిక్షణా తరగతులు

» విద్యాశాఖలో మండల, జిల్లా స్థాయి రిసోర్స్ పర్సన్ల ఎంపిక

» ఆసక్తి కలిగిన ఉపాధ్యాయులు దరఖాస్తు చేసుకోవాలి

» జిల్లా విద్యాశాఖ అధికారి ఎండీ అబ్దుల్ ఘని

వనపర్తి విద్యావిభాగం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో గుణాత్మక విద్య అమలు చేసేందుకు, ఉపాధ్యాయులకు శిక్షణ అందించేందుకు రిసోర్స్ పర్సన్‌లను ఎంపిక చేయాలని తెలంగాణ రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ సంచాలకులు ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు జిల్లాలో పని చేస్తున్న మండల, జిల్లా పరిషత్, తెలంగాణ మోడల్, రెసిడెన్షియల్ పాఠశాలల నుంచి ఆసక్తి కలిగిన ఎస్జీటీ, స్కూల్ అసిస్టెంట్, ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎం, గెజిటెడ్ హెడ్మాస్టర్‌ల నుంచి మండల, జిల్లాస్థాయి రిసోర్స్ పర్సన్‌లుగా పని చేసేందుకు ఆసక్తి కలిగిన ఉపాధ్యాయుల నుంచి ఈనెల 22 నుంచి 24వ తేదీ వరకు జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయంలో దరఖాస్తులను స్వీకరించనున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి అబ్దుల్ ఘని ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టర్ ఆధ్వర్యంలో ఇంటర్వ్యూ, డెమో ద్వారా ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. ఎంపిక చేసిన జాబితాను ఎస్సీఈఆర్టీ తెలంగాణకు ఈనెల 28వ తేదీ లోపు అందించనున్నామని తెలిపారు. ఆసక్తి కలిగిన తెలుగు, ఆంగ్లం, ఉర్దూ మీడియాల ఉపాధ్యాయులు నిర్దేశించబడిన ఫారం ద్వారా దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు.

ప్రపంచ శాంతి కోసం పాదయాత్ర

» రామేశ్వరం నుంచి కాశీకి వెళ్తున్న బృందం

» మూసాపేటలో ఘన స్వాగతం



పాదయాత్ర బృందానికి స్వాగతం పలికిన అయ్యప్ప సంకల్పసిద్ధి సేవాసమితి సభ్యులు

మూసాపేట, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచ శాంతిని ఆకాంక్షిస్తూ తమిళనాడుకు చెందిన 24 మంది చేపట్టిన పాదయాత్ర సోమవారం మూసాపేటకు చేరుకున్నది. వారికి అయ్యప్ప సంకల్పసిద్ధి సేవాసమితి సభ్యులు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రామేశ్వరం నుంచి ఉత్తరప్రదేశ్‌లోని కాశీ వరకు కాలినడకన వెళ్తున్నట్లు వారు తెలిపారు. నాలుగేళ్లకో సారి ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పాదయాత్ర చేపట్టి 50 రోజులు గడిచిందని, ఈ సందర్భంగా అయ్యప్ప సన్నిధానంలో గోల్డెన్ జూబ్లీ వేడుకలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మురుగన్ స్వామికి పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలు చేయనున్నట్లు పేర్కొన్నారు. పాదయాత్ర బృందానికి అల్పాహారం, భోజన వసతులు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు నల్ల తిరుపతయ్యగౌడ్, కొంగరి శ్రీనివాసులు, గూపని కొండయ్య, విశ్వేశ్వర్, నరహరి, రాజు తదితరులు పాల్గొన్నారు.

బంగారు మైసమ్మ ఆలయంలో మంటలు



బంగారు మైసమ్మ ఆలయంలో ఎగిసిపడుతున్న మంటలు

మిడ్జిల్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాణిపేట బంగారు మైసమ్మ ఆలయ మండపంలో సోమవారం రాత్రి ఒక్కసారిగా మంటలు ఎగిసిపడినట్లు స్థానికులు తెలిపారు. ఆలయంలోపల ఉన్న స్టార్టర్ డబ్బాకు షార్ట్ సర్క్యూట్ అయ్యి తీగలకు మంటలు వ్యాపించడంతో అక్కడే ఉన్న స్థానికులు మంటలను ఆర్పినట్లు తెలిపారు. సకాలంలో మంటలార్పడంతో పెద్దగా నష్టమేమీ జరగలేదని స్థానికులు తెలిపారు.

వికసించిన 'బ్రాకిస్టెల్మా'

» జడ్చర్ల డిగ్రీ కళాశాల బొటానికల్ గార్డెన్‌లో అరుదైన పుష్పం

జడ్చర్ల, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లా, జడ్చర్ల పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ అండ్ పీజీ కళాశాలలోని బొటానికల్ గార్డెన్‌లో సోమవారం అరుదైన పుష్పం బ్రాకిస్టెల్మా బైలోబేటమ్ వికసించిందని కళాశాల ప్రిన్సిపాల్ సుకన్య, గార్డెన్ సమన్వయకర్త, వృక్షశాస్త్ర సహాయాచార్యుడు డాక్టర్ సదాశివయ్య తెలిపారు. ఈ మొక్కను 2020 సంవత్సరంలో ఢిల్లీలోని శ్రీవెంకటేశ్వర కళాశాల వృక్షశాస్త్ర సహాయాచార్యుడు డాక్టర్ ప్రసాద్‌తో కలిసి కనుక్కొని, బ్రాకిస్టెల్మా బైలోబేటమ్ అని నామకరణం చేసినట్లు ప్రిన్సిపాల్ సుకన్య తెలిపారు. ఈ మొక్క విశిష్టతలను డాక్టర్ సదాశివయ్య వివరించారు. ఇవి నల్లమల ప్రాంతంలోనే పెరుగుతాయని, ప్రపంచంలో మరెక్కడా ఉండవని తెలిపారు. భూమిలో దుంప ఉండే ఈ మొక్కకు తొలకరి వర్షాలు పడగానే పొడవాటి కాండం వచ్చి పుష్పిస్తుందని, ఆ తర్వాత ఆకులు రావడం దీని ప్రత్యేకత అని వివరించారు. సన్నని కాండం 25 సెంటీమీటర్ల వరకు పెరుగుతుందని, ప్రతి కణుపు వద్ద తెల్లని కేశాలున్న రెండు ముదురు ఎరుపు లేదా నల్లని పూలు పూస్తాయని తెలిపారు. ఈ పూలు 8 మిల్లీమీటర్ల నుంచి ఒక సెంటీమీటరు వరకు పెరుగుతాయని చెప్పారు. జలుబు, తలనొప్పి, రొమ్ము నొప్పులకు ఈ మొక్క దుంపలను మందుగా వినియోగిస్తున్నారని తెలిపారు. దీని ఔషధ గుణాలపై లోతైన పరిశోధనలు జరగాల్సిన అవసరముందన్నారు. బొటానికల్ గార్డెన్‌లో ఈ మొక్క పుష్పించడం ఇదే మొదటి సారని పేర్కొంటూ సంతోషం వ్యక్తం చేశారు.



వికసించిన అరుదైన బ్రాకిస్టెల్మా బైలోబేటమ్ పుష్పం

ఇంటర్వ్యూ..

గాలి ద్వారా ఒక పశువు నుంచి మరో పశువుకు వ్యాప్తి

- ఉదయ్‌కుమార్‌రెడ్డి, పశువైద్యాధికారి, తిమ్మాజిపేట



తిమ్మాజిపేట, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : గాలికుంటు వ్యాధి వైరస్ వల్ల వస్తుందని పశు వైద్యాధికారి ఉదయ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. గాలికుంటు వ్యాధి నివారణకు టీకాలు వేస్తున్నట్లు ఆయన ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూలో తెలిపారు.

గాలికుంటు వ్యాధి దేనివలన సోకుతుంది ?

ఈ వ్యాధి వైరస్ వలన సోకుతుంది. గాలి ద్వారా ఒక పశువు నుంచి మరొక పశువుకు త్వరగా వ్యాప్తి చెందుతుంది. జాగ్రత్తలు పాటించాలి.

పశువుల్లో ఈ వ్యాధికి సంబంధించిన లక్షణాలు ఏమిటి?

104 నుంచి 105 డిగ్రీల తీవ్ర జ్వరం ఉండి, మేత మేయకపోవడం, కాలిగిట్టల మధ్య పొక్కులు, నోట్లో పొక్కుల వలన సక్రమంగా మేత మేయదు. దీనివల్ల నడవలేకపోవడం, ఆవుల్లో పాల దిగుబడి తగ్గుతుంది. వ్యవసాయ పనులకు ఉపయోగపడే ఎద్దుల్లో సామర్థ్యం తగ్గుతుంది.

పశువైద్య శిబిరాల ద్వారా ఇప్పటి వరకు ఎన్ని పశువులకు టీకాలు వేశారు?

ప్రస్తుతానికి 825 తెల్లజాతి పశువులకు, 851 నల్లజాతి పశువులకు టీకాలు వేశాం.

గాలికుంటు వ్యాధి నివారణకు ఇంకేమైనా జాగ్రత్తలు ఉన్నాయా?

గాలికుంటూ వ్యాధి నివారణకు టీకాలు వేయించడమే సరైన నిర్ణయం. ఈ నెల 16న ప్రారంభమైన పశువైద్య ఉచిత శిబిరాలు మే నెల 15వరకు గ్రామాల్లో కొనసాగుతాయి. తమ సిబ్బంది పశువులకు టీకాలు వేస్తున్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

న్యూస్ బాక్స్

హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలి

కోడేరు, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్ష హాల్ టికెట్లు వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయని, వాటిని డౌన్‌లోడ్ చేసుకోవాలని కోడేరు మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ రాఘవేంద్ర అన్నారు. సోమవారం విలేకరులతో మాట్లాడుతూ తెలంగాణ మోడల్ స్కూల్ ప్రవేశం కోసం దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఈ నెల 27న ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నామని, దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు తమ హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. ఆరవ తరగతి విద్యార్థులకు 10 గంటల నుంచి 12 గంటల వరకు, ఏడవ తరగతి నుంచి పదవ తరగతి వరకు మధ్యాహ్నం రెండు గంటల నుంచి నాలుగు గంటల వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. విద్యార్థులు ఈ పరీక్షలను దృష్టిలో పెట్టుకుని సకాలంలో హాజరై పరీక్షలు రాయాలని ఆయన కోరారు.

కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి

- అచ్చంపేట పీఏసీఎస్ సీఈవో ఎల్లయ్య

అచ్చంపేటటౌన్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : వరి కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని అచ్చంపేట పీఏసీఎస్ సీఈవోఎల్లయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు పండించిన పంటను ప్రభుత్వం మద్దతు ధర రూ 2320 చెల్లించి కొనుగోలు చేస్తుందన్నారు. సన్నరకాల వడ్లకు అదనంగా రూ.500 బోనస్ చెల్లిస్తుందన్నారు. గ్రామాల్లో ఇప్పటికే కొనుగోలు కేంద్రాలను ప్రారంభించామని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేడు భూభారతిపై అవగాహన సదస్సు

ఉప్పునుంతల, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన ఉప్పునుంతలలోని రైతు వేదికలో మధ్యాహ్నం 2 గంటలకు భూభారతిపై అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ ప్రమీల సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సదస్సుకు మండల అధికారులు, నాయకులు, రైతులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

బల్మూరులో..

బల్మూరు, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : భూభారతి-2025 అనే అంశంపై నేడు మంగళవారం మండల కేంద్రంలోని రైతు వేదికల్లో రైతులతో పాటు అధికారులు ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేస్తున్నట్లు తహసీల్దార్ శ్రీకాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి సంబంధించిన శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు, మండల వ్యాప్తంగా రైతులు అధిక సంఖ్యలో పాల్గొనాలని తహసీల్దార్ కోరారు.

'కార్మికులకు సంక్షేమ బోర్డులు ఏర్పాటు చేయాలి'

పెద్దకొత్తపల్లి, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం అసంఘటిత కార్మికులకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని భారతీయ మజ్దూర్ సంఘ్ రాష్ట్ర సంఘటన కార్యదర్శి రామ్మోహన్ డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రమైన పెద్దకొత్తపల్లిలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ 15 సంవత్సరాలుగా తెలంగాణ రాష్ట్రంలో కనీస వేతనాలు సవరణ జరగలేదు. దీని కారణంగా కోటి 20 లక్షల మంది కార్మికులు కనీస వేతనా లను పొందలేకపోతున్నారు.రాష్ట్ర ప్రభుత్వం అసంఘటిత కార్మికులకు సంబంధించిన సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని కోరారు. ఈపీ ఎస్ 95పెన్షన్ 1000రూపాయల నుంచి 5000 వరకు పెంచాలని ప్రభుత్వాన్ని కోరారు. సమావేశంలో బీఎంఎస్ జిల్లా కన్వీనర్ చంద్రశేఖర్, నాయకులు ప్రభాకర్, బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి జలాల శివుడు, బీజేపీ మండల మాజీ అధ్యక్షుడు భీమేశ్ పాల్గొన్నారు.

మామిడి రైతుకు నష్టం

పెద్దకొత్తపల్లి, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వివిధ గ్రామాల్లో ఆదివారం సాయంత్రం గాలివాన బీభత్సం సృష్టించింది. పెద్దకొత్తపల్లి, దేవునితిర్మలాపూర్, నక్కలపల్లి, జొన్నలబొగుడ, సాతాపూర్, చంద్రకల్, ముష్టిపల్లి, కల్వకోల్, చిన్నపురావుపల్లి తదితర గ్రామాల్లో భారీ వర్షం కురిసింది. మామిడికాయలు నేలరాలాయి. మామిడి రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. అంతేకాకుండా రహదారుల వెంట ఉన్న పెద్దపెద్ద చెట్లు విరిగిపడ్డాయి. ఈదురు గాలులకు మామిడి తోటలు నష్టపోయిన రైతులకు ప్రభుత్వం నష్ట పరిహారం చెల్లించి ఆదుకోవాలని పలు గ్రామాల మామిడి రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.



పెద్దకొత్తపల్లి నుంచి దేవునితిర్మలాపూర్ వెళ్లే రహదారిపై విరిగి పడిన చెట్టు



పెద్దకొత్తపల్లిలో వెంకట్‌రెడ్డి మామిడి తోటలో నేలరాలిన మామిడికాయలను పరిశీలిస్తున్న హార్టికల్చర్ అధికారి లక్ష్మణ్

ఆందోళన చెందొద్దు..ప్రతీ గింజను కొంటాం



నాగర్‌కర్నూల్ వ్యవసాయ మార్కెట్‌లో తడిసిన మొక్కజొన్నను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రాజేశ్‌రెడ్డి

- నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే రాజేశ్‌రెడ్డి

- వ్యవసాయ మార్కెట్‌లో తడిసిన ధాన్యం పరిశీలన

నాగర్‌కర్నూల్ టౌన్/ బిజినేపల్లి/ తిమ్మాజిపేట, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : అకాల వర్షంతో తడిసిన ధాన్యం గురించి రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ప్రతీ గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే డాక్టర్ కూచకుళ్ల రాజేష్‌రెడ్డి హామీ ఇచ్చారు. సోమవారం నాగర్‌కర్నూల్ వ్యవసాయ మార్కెట్‌ను సందర్శించిన ఎమ్మెల్యే తడిసిన ధాన్యాన్ని పరిశీలించి రైతులతో మాట్లాడి వివరాలను తెలుసుకున్నారు. అకాల వర్షాలతో దెబ్బతిన్న పంటల వివరాలను సీఎం దృష్టికి తీసుకెళ్లి నష్టపోయిన రైతులకు న్యాయం జరిగేలా చూస్తానని హామీ ఇచ్చారు. విపక్షాల విమర్శలు మానుకొని రైతులకు అండగా నిలవాలని హితవు పలికారు. ఎమ్మెల్యే వెంట మార్కెట్ కమిటీ చైర్మన్ రమణారావు, డైరెక్టర్లు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

● బిజినేపల్లి మండలంలోని వివిధ గ్రామాల్లో అకాల వర్షాలకు తడిసిన ధాన్యాన్ని, నేలకు ఒరిగిన వరి, మొక్కజొన్న పంటలను పరిశీలించి ప్రభుత్వం నుంచి పరిహారం అందించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేశ్‌రెడ్డి రైతులకు భరోసా ఇచ్చారు. ఆయన వెంట పీఏసీఎస్ చైర్మన్ బాలరాజుగౌడ్, ఐకేపీ ఏపీఎం విజయ, సీసీ ప్రశాంత్, కాంగ్రెస్ పార్టీ నాయకులు కృష్ణారెడ్డి, మల్లికార్జున్‌రెడ్డి, కృష్ణయ్య, గోవిందు నాయక్, పూల్యానాయక్, పాండు నాయక్ ఉన్నారు.

● తిమ్మాజిపేట మండలంలోని బుద్దసముద్రం, ఆవంచ గ్రామాల్లో సోమవారం సింగిల్ విండో ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేశ్‌రెడ్డి ప్రారంభించారు. రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని, కొనుగోలు కేంద్రాలల్లో వరిని అమ్మి ప్రభుత్వం అందిస్తున్న గిట్టుబాటు ధర పొందాలన్నారు. నాయకులు ఉన్నారు.

కలెక్టరేట్ ప్రజావాణికి 35 ఫిర్యాదులు



కలెక్టరేట్ ప్రజావాణిలో వినతిపత్రం స్వీకరిస్తున్న ఏఓ చంద్రశేఖర్

నాగర్‌కర్నూల్ టౌన్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : ఈ వారం కలెక్టరేట్ ప్రజావాణికి మొత్తం 35 వినతులు వచ్చాయి. వివిధ సమస్యలపై ప్రజల నుంచి అందిన వినతులను కలెక్టరేట్ పరిపాలనాధికారి చంద్రశేఖర్ స్వీకరించి పరిశీలన అనంతరం విచారణ కోసం సంబంధిత శాఖల అధికారులకు బదిలీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా స్థాయి సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు చేపట్టడంతో పాటు క్షేత్ర స్థాయి సమస్యల పరిష్కారం కోసం సంబంధిత మండలాలకు బదిలీ చేయాలని అధికారులను కోరారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సెక్షన్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్పీ కార్యాలయంలో...

నాగర్‌కర్నూల్ క్రైం : ఫిర్యాదుదారుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ తెలిపారు. సోమవారం జిల్లా పోలీస్ సముదాయంలో నిర్వహించిన పోలీస్ ప్రజావాణికి 9ఫిర్యాదులు వచ్చినట్లు ఆయన తెలిపారు.

భూసమస్యల పరిష్కారం కోసమే భూభారతి

- అదనపు కలెక్టర్ అమరేందర్



భూభారతి గురించి తహసీల్దార్‌ను అడిగి తెలుసుకుంటున్న అదనపు కలెక్టర్

ఉప్పునుంతల, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : భూసమస్యల పరిష్కారం కోసం భూభారతి పథకం ఉందని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని జాయింట్ కలెక్టర్ అమరేందర్ అన్నారు. సోమవారం మండల కేంద్రమైన ఉప్పునుంతలలోని తహసీల్దార్ కార్యాలయాన్ని ఆయన సందర్శించారు. భూ సమస్యలు ఉన్న రైతులు భూ భారతి సదస్సులో దరఖాస్తు చేసుకోని పరిష్కరించుకోవాలని ఆయన సూచించారు. ఇసుక క్వారీల గురించి తహసీల్దార్ ప్రమీలను అడిగి తెలుసుకున్నారు.

ధరణి ఆపరేటర్ వేధింపులు

ఉప్పునుంతల, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : తహసీల్దార్ కార్యాలయంలో ధరణి ఆపరేటర్‌గా పని చేస్తున్న రాజు రిజిస్ట్రేషన్ కోసం కార్యాలయానికి వచ్చిన రైతులను అదనంగా డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్నట్లు రిజిస్ట్రేషన్ కోసం వచ్చిన పలువురు రైతులు వాపోయారు. ఈ విషయంపై తహసీల్దార్ ప్రమీలను వివరణ కోరగ తన దృష్టికి ఇప్పుడే వచ్చిందని, ఆపరేటర్‌పై చర్యలు తీసుకుంటామని తెలిపారు

ఫూలే, అంబేడ్కర్ జాతరను జయప్రదం చేయాలి

పెద్దకొత్తపల్లి, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో ఈ నెల 22వ తేదీన నిర్వహించనున్న ఫూలే, అంబేడ్కర్ జాతర ఉత్సవాలను జయప్రదం చేయాలని కమిటీ మండల అధ్యక్షుడు గడ్డం యాదగిరి, గౌరవ అధ్యక్షుడు కే.నరసింహులు కోరారు. సోమవారం పెద్దకొత్తపల్లి బస్టాండ్ చౌరస్తాలో ఫూలే, అంబేడ్కర్ జాతర కమిటీ ఆధ్వర్యంలో వాల్‌పోస్టర్లను విడుదల చేశారు. జిల్లా కేంద్రంలోని జడ్పీహెచ్‌ఎస్ గ్రౌండ్‌లో సాయంత్రం 4గంటలకు జరగనున్న ఈ ఉత్సవాలకు ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ కాశీం, బహుజన యుద్ధనౌక డాక్టర్ ఏపూరి సోమన్న, కవి గాయకులు గిద్దె రాంనర్సయ్య, మచ్చ దేవేందర్‌లు ముఖ్య అతిథులుగా హాజరవుతారని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో బహుజన సంఘాల నాయకులు ఎన్.కృష్ణయ్య, డి.ప్రభాకర్, తగిలి వెంకటస్వామి, బద్యానాయక్, గులాం రసూల్, గడ్డం యాదగిరి, గండు వెంకటయ్య, కాడేపాక నరసింహ, పి.పర్వతాలు పాల్గొన్నారు. ఫూలే, అంబేడ్కర్ జాతర మండలం కమిటీని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి శివకుమార్, జిల్లా ఉపాధ్యక్షుడు ఆదిసోమనాథ్ ఆధ్వర్యంలో సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా గడ్డం యాదగిరి, ప్రధాన కార్యదర్శి ఎస్‌కే.తాహెర్, మిగతా కమిటీని ఎన్నుకున్నారు.

నాణ్యమైన విద్య అందేలా చూడాలి

- కల్వకుర్తి మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్‌కుమార్



కరపత్రాలను విడుదల చేస్తున్న కల్వకుర్తి మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్‌కుమార్, సీఐ నాగార్జున, ఎస్ఐ మాధవరెడ్డి

కల్వకుర్తి, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన చేస్తే పోటీ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధిస్తారని కల్వకుర్తి మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్ కుమార్ అన్నారు. కల్వకుర్తి పట్టణంలో విద్య కోచింగ్ ఇనిస్టిట్యూట్ ఆధ్వర్యంలో శిక్షణ పొందిన విద్యార్థులు నవోదయ, గురుకుల, సైనిక్, మిలిటరీ పాఠశాలల్లో పోటీ పరీక్షల్లో ప్రతిభ చాటి కొంతమంది సీట్లు సాధించారు. సోమవారం ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు కల్వకుర్తి మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్ కుమార్‌తోపాటు సీఐ నాగార్జున, ఎస్ఐ మాధవరెడ్డి, నాయకులు సంజీవ్‌కుమార్ యాదవ్, గోరటి శ్రీనివాసులు, శ్రీకాంత్‌రెడ్డిలు అభినందించారు. కార్యక్రమంలో డైరెక్టర్ శివకుమార్, పలువురు నాయకులు ఉన్నారు.

నష్టపోయిన రైతులకు ప్రభుత్వం పరిహారం చెల్లించాలి

బిజినేపల్లి, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలో ఆదివారం ఈదురు గాలులతో కూడిన భారీ వర్షానికి నేలవాలిన మొక్కజొన్న, వరి పైరును పలువురు బీఆర్ఎస్ నాయకులు పరిశీలించారు. మాజీ ఎంపీపీ శ్రీనివాసుగౌడ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పులేందర్‌రెడ్డి, మాజీ రైతు బంధు మండల అధ్యక్షుడు నెల్లికంటి మహేశ్వర్‌రెడ్డి, సురభి శేఖర్‌రావు, మాజీ ఎంపీటీసీ సభ్యులు చీర్లం బాలస్వామి, తిరుపతిరెడ్డి లట్టుపల్లి, మహాదేవునిపేట, బిజినేపల్లి తదితర గ్రామాల్లో నేలకు ఒరిగిన వరి, మొక్కజొన్న పంటలను పరిశీలించారు. నష్టపోయిన రైతులందరికీ ప్రభుత్వం పరిహారం చెల్లించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. లట్టుపల్లిలో కల్లాల్లో ఆరబోసిన ధాన్యం తడిసిందని, మహాదేవునిపేటలో కూలిన రెండు కోళ్లఫారాలను, మామిడి కాయలు రాలిన తోటలను పరిశీలించారు. ప్రభుత్వం ఆదుకోవా లని కోరారు. బీఆర్ఎస్ నాయకులు వెంకటయ్య, శ్రీనివాస్ గౌడ్, రాజుగౌడ్, వెంకట్‌రెడ్డి, రైతులు ఉన్నారు.



మహాదేవునిపేటలో అకాల వర్షానికి దెబ్బతిన్న మొక్కజొన్న పంటను రైతులతో కలిసి పరిశీలిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

మామిడి రైతులను ఆదుకోవాలి

- సీపీఎం మండల కార్యదర్శి శివ వర్మ



నార్లాపూర్‌లో మామిడి రైతులతో మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

కొల్లాపూర్ : కొల్లాపూర్ మండల పరిధిలో వరుసగా వీస్తున్న అకాల వర్షాలకు, ఈదురు గాలులకు మామిడి తోటల రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఎం మండల కార్యదర్శి శివవర్మ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం కొల్లాపూర్ మండల పరిధిలోని నార్లాపూర్ గ్రామంలో మామిడి తోటలను మండల కమిటీ సభ్యు లు కిరణ్‌కుమార్, ఎండీ స లీంతో కలిసి శివవర్మ పరిశీలిం చారు. అంతంత మాత్రంగా ఉన్న దిగుబడి అకాల వర్షాలు, వడగాలలకు అంతా నేలపాలైందన్నారు. ఎన్నికలు వచ్చిన ప్రతీసారి కొల్లాపూర్‌లో మామిడి కొనుగోలు మార్కెట్ సౌకర్యం కల్పిస్తామని హామీలు ఇవ్వడం తప్ప, ఏర్పాటుకు చర్యలు శూన్యమని ఎద్దేవాచేశారు. ఉన్నారు. ప్రభుత్వం రైతులను ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్ర మంలో సీపీఎం నాయకులు సత్యనారాయణ, రాముడు, రైతులు సత్యం, చెన్నమ్మ, ఎల్లమ్మ, కాశన్న పాల్గొన్నారు.

ఉపాధి కూలీల పెండింగ్ బిల్లులు చెల్లించాలి

- వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు బి.బాలస్వామి

నాగర్‌కర్నూల్‌టౌన్, ఏప్రిల్21 (ఆంధ్రజ్యోతి) : ఉపాధి హామీ కూలీలకు పెండింగ్‌లో ఉన్న నాలుగు నెలుగు నెలల బిల్లులను వెంటనే చెల్లించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు బి.బాలస్వామి డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం ఎదుట వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఉపాధి హామీ కూలీలు ధర్నా నిర్వహించి పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఎంపీడీవో కోటేశ్వర్‌కు అందజేశారు. భూమి లేని జాబ్ కార్డు ఉపాధి కూలీలకు ఏడాదికి రూ.12 వేలు ఇస్తామన్న హామీ నేటికీ అమలుకు నోచుకోలేదన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు సుభాష్, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.శ్రీనివాస్, నాయకులు మధు, సురేష్, కూలీలు బంగారమ్మ, అలివేల, పార్వతమ్మ, బాలమణి, రాములమ్మ, బారుసా వులు, కురుమయ్య, బాలకిష్టయ్య, రాములు, బాలయ్య, పర్వతాలు, హుస్సేన్ పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట



మర్రిపల్లిలో హైమాస్ట్ లైటును ప్రారంభిస్తున్న కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బాలరాం గౌడ్, చిత్రంలో ఎస్ఐ శంషుద్దీన్

చారకొండ, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జమ్మికింది బాలరాం గౌడ్ అన్నారు. మండలంలోని మర్రిపల్లిలో అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ తన నిధులు ద్వారా రూ. 2 లక్షలతో మంజూరైన హైమాస్ట్ లైటును బాలరాంగౌడ్ పార్టీ నాయకులు, ఎస్ఐ శంషుద్దీన్‌తో కలిసి సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచుల సంఘం మండల మాజీ అధ్యక్షుడు అంగోత్ నరేష్ నాయక్, కాంట్రాక్టర్ లక్ష్మణ్‌నాయక్, ఎన్ఎస్‌యూఐ మండల అధ్యక్షుడు గోరేటి శివ, నాయకులు జేసీబీ వెంకటయ్యగౌడ్, తిరుమలేష్, రవీంద రెడ్డి, సుధాకర్‌రెడ్డి, జంగిరెడ్డి, కొండల్‌రెడ్డి, నూనే విష్ణు, కృష్ణారెడ్డి, మణిపాల్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


అభివృద్ధి పనులకు శంకుస్థాపన

పెద్దకొత్తపల్లి, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నక్కలపల్లి గ్రామంలో ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు సహకారంతో రూ.23లక్షల నిధులతో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. గ్రామంలోని బీసీ కాలనీకి రూ.10లక్షల సీసీ రోడ్డు, ఎస్సీ సబ్ ప్లాన్ కింద రూ.13లక్షలతో అండర్ గ్రౌండ్‌డ్రైనేజీ, సీసీ రోడ్డు పనులకు సోమవారం గ్రామ మాజీ ప్రజాప్రతినిధులు భూమి పూజ చేశారు. గ్రామ సెక్రటరీ ఆధ్వర్యంలో మాజీ ఉప సర్పంచ్ మేకల మల్లేష్ మంత్రి జూపల్లి కృష్ణారావు, మాజీ ఎంపీపీ సూర్యప్రతాప్‌గౌడ్‌లకు మాజీ ఉప సర్పంచ్ మేకల మల్లేష్ ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఇందిరమ్మ కమిటీ సభ్యులు మొట్టె శేఖర్, కొత్త రవీందర్‌రెడ్డి, కాళ్ల రేణుక, బంగారయ్య, మాజీ వార్డు మెంబర్లు మొట్టే కుర్మయ్య, సుధాకర్ పాల్గొన్నారు.

పౌష్టికాహారంపై అవగాహన

చారకొండ, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): సోమవారం మండల కేంద్రంలోని అంగన్‌వాడీ సెంటర్-1లో మండల ఆయుర్వేద వైద్యురాలు డాక్టర్ గాయత్రి బాలింతలకు, గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించి, పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. క్రమం తప్పకుండా రోజూ యోగా కార్యక్రమాలు చేయాలన్నారు. కార్యక్రమంలో ఫార్మాసిస్టు బిచ్యానాయక్, అంగన్‌వాడీ టీచర్ సుదేష్ణ, ఏఎన్ఎంలు అలివేలు, సరిత, ఆశ వర్కర్లు సత్యావతి, రాములమ్మ, సువర్ణ, యోగ ఇన్‌స్ట్రక్టర్లు సునంద పాల్గొన్నారు.

మేడేను జయప్రదం చేయాలి



వాల్‌పోస్టర్‌ను విడుదల చేస్తున్న ఏఐటీయూసీ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం.నరసింహ

కందనూలు, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : 139వ మేడే అమరవీరుల స్ఫూర్తితో జరుపుకుందామని ఏఐటీయూసీ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం.నరసింహ పిలుపునిచ్చారు. నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో సోమవారం వాల్ పోస్టర్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మారేడు శివశంకర్, పబ్లిక్ సెక్టార్ ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి శంకర్, ఏఐటీయూసీ భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు చిన్నపాగ శ్రీనివాసులు, దాంగట్ల వెంకటస్వామి, హమాలీ సంఘం జిల్లా నాయకులు గొర్ల సత్యం పాల్గొన్నారు.

అలరించిన చిన్నారుల నృత్యాలు

బిజినేపల్లి, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని మాస్టర్ మైండ్స్ హైస్కూల్ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాల్లో చిన్నారులు చేసిన నృత్యాలు అలరించాయి. సోమవారం ఎంజేఆర్ ఫంక్షన్‌లో నిర్వహించిన వార్షికోత్సవ సమావేశంలో ఎంఈవో రఘునాథ్ శర్మ మాట్లాడుతూ విద్యార్థులకు విద్యతో పాటు ఆటలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో అవకాశం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ సుబ్బారెడ్డి, డైరెక్టర్ భానుప్రకాశ్‌రెడ్డి, సత్తార్, వహీద్, బాలాజీ, విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మన సేవా సమితి అధ్యక్షుడికి ఎక్స్‌లెన్స్ అవార్డు

కల్వకుర్తి, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : కల్వకుర్తి మండలం ఎల్లికట్ట గ్రామానికి చెందిన మన సేవా సమితి అధ్యక్షుడు వి.వేణుగోపాల్ ఎక్స్‌లెన్స్ అవార్డు అందుకున్నారు. ఆలూరి కల్చరల్ అండ్ సోషల్ ఆర్గనైజేషన్ ఫ్రెండ్షిప్, మినిస్ట్రీస్ సంయుక్త ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో సన్మాన కార్యక్రమం సోమవారం ఏర్పాటు చేశారు. వేణుగోపాల్‌కు రాష్ట్ర సీఎస్ కోర్టు సీనియర్ సూపరింటెండెంట్, సామాజిక నాయకులు వీవీపీ అంజనీకుమారికి డాక్టర్ ఆశన్‌బ్రహ్మ, శంకర్ నారాయణ, రివర్స్ రీడ్ గురుస్వామి, రిటైర్డు పోలీస్ అధికారి ప్రేమారెడ్డి, ఆర్పిత, ఆలూరి విల్సన్, ఇందిర, విశ్వేశ్వర్ రావులు సన్మానం చేసిన అవార్డు సంతోషంగా ఉందన్నారు.

బియ్యం పంపిణీ చేయాలి

పెంట్లవెల్లి, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : రేషన్ కార్డులోపేర్లు నమోదైన వారికి వెంటనే బియ్యం పంపిణీ చేయాలని సీపీఎం జిల్లా నాయకులు ఈశ్వర్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ జయసింహకు వినతి పత్రం అందజేశారు. కొత్త పేర్లు వచ్చిన వారికి వెంటనే రేషన్ బియ్యం సరఫరా చేయాలని వారన్నారు. అదే విధంగా చాలా మంది రేషన్ కార్డు కోసం అర్హత ఉన్న ఇంత వరకు ఇవ్వలేదని వారన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల నాయకులు ఎస్.హనుమంతు, బండారి శ్రీనివాసులు, తిమ్మ స్వామి, శ్రీనివాసులు, గోపాలు, లక్ష్మయ్య పాల్గొన్నారు.

కొండారెడ్డిపల్లిలో కొనసాగుతున్న కంటి వైద్య శిబిరం

వంగూరు, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సీఎం రేవంత్‌రెడ్డి స్వగ్రామమైన కొండారెడ్డిపల్లిలో ఏర్పాటు చేసిన ఉచిత నేత్ర వైద్య శిబిరం కొనసాగుతోంది. గ్రామస్థులతో పాటు సమీప గ్రామాలకు చెందిన ప్రజలు వైద్య సేవలు పొందుతున్నారు. కొండారెడ్డిపల్లిలో శంకర నేత్రాలయ ఆధ్వర్యంలో ఆధునిక వసతులతో ఉచిత కంటి పొర చికిత్స శిబిరం 3వ రోజు విజయవంతంగా కొనసాగింది. సోమవారం 350 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా ఇందులో 40 మందికి కంటి శుక్లాం ఉన్న వారిని గుర్తించి ఆపరేషన్లకు రెఫర్ చేయడం జరిగిందని, 126 మందికి కంటి అద్దాలు పంపిణీ చేసినట్లు మాజీ ఉప సర్పంచ్ వేమారెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఎనుముల రాజశేఖర్‌రెడ్డి, బాబు పాల్గొన్నారు.

'రైతు భరోసా డబ్బులు చెల్లించాలి'

బల్మూరు, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : రైతులకు యాసంగి సీజన్‌కు సంబంధించిన రైతు భరోసా కింద పెట్టుబడి సహాయాన్ని వెంటనే చెల్లించాలని సీపీఎం మండల కార్యదర్శి శంకర్‌నాయక్ ఒక ప్రకటనలో రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఇప్పటి వరకు వరకు నాలుగు ఎకరాల లోపు ఉన్న రైతులకు మాత్రమే పెట్టుబడి సాయం అందించగా, ఆ పైన ఉన్న రైతులందరికీ పూర్తిస్థాయిలో రైతు భరోసా చెల్లించలేదని పేర్కొన్నారు. రైతులు ఇప్పటికే చాలా వరకు అప్పులు చేసుకుని ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. ఇప్పటికైనా రైతులకు రైతుబంధు డబ్బులు చెల్లించి న్యాయం చేయాలని ఆయన కోరారు.

అంబేడ్కర్ జాతర కమిటీ కార్యవర్గం ఎన్నిక

నాగర్‌కర్నూల్‌టౌన్, ఏప్రిల్21 (ఆంధ్రజ్యోతి) : అంబేడ్కర్ జాతర జిల్లా నూతన కార్యవర్గం ఏర్పడింది. జిల్లా కేంద్రలోని బాబు జగ్జీవన్‌రాం భవన్‌లో నిర్వహించిన సమావేశంలో అంబేడ్కర్ జాతర జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా గౌరవ అధ్యక్షుడిగా ఎండీ. నిజాముద్దీన్, అధ్యక్షుడిగా గడ్డం విజయ్, ప్రధాన కార్యదర్శిగా వంగూరి జయశంకర్, కోశాధికారిగా మద్దెల చంటి, ఉపాధ్యక్షులుగా నూతనగంటి నరేష్, చింతపల్లి వేణు, మిద్దె రాములు, కార్యదర్శులుగా జిలకర బాలస్వామి, నరిగె నరేందర్, సహాయ కార్యదర్శులుగా గోరెటి సూరి, ప్రచార కార్యదర్శిగా మంచెల విష్ణు, చింతపల్లి శివశంకర్, నారిమల్ల ఆంజనేయులు, గౌరవ సలహాదారులుగా కాళ్ల నిరంజన్, జన్ను సాయిబాబుతో పాటు 40 మంది సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడు గడ్డం విజయ్ మాట్లాడుతూ ఈ నెల 30న జిల్లా కేంద్రంలో అంబేడ్కర్ జాతర నిర్వహించనున్నామని పేర్కొన్నారు. మేధావులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

పాఠశాలలకు వంట పాత్రలు అందజేత



తాడూరు జడ్పీహెచ్ఎస్ హెచ్ఎంలకు వంట పాత్రలు అందజేస్తున్న దృశ్యం

తాడూరు, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలకు పీఎం పోషణ్ అభియాన్ పథకం కింద సోమవారం వంట పాత్రలను ఎమ్మార్సీలో పాఠశాల ప్రధానోపాధ్యాయులకు ఎంఈవో శ్రీనివాస్‌రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన ఆహారాన్ని శుచి శుభ్రంగా అందివ్వడంలో ఎలాంటి అలసత్వం చూపకూడదని చెప్పారు. నూతన వంట పాత్రలో భోజనాన్ని విద్యార్థుల కోసం తయారు చేయాలని కోరారు. కార్యక్రమంలో సిర్సవాడ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు అనిల్ కుమార్ రెడ్డి, హెచ్ఎలు,ఎమ్మార్సీ సిబ్బంది పాల్గొన్నారు.

● ఉప్పునుంతల : స్థానిక ఎమ్మార్సీ భవనంలో సోమవారం మండలంలోని ప్రభుత్వ పాఠశాలలకు కేటాయించిన మధ్యాహ్నం భోజనం పథకానికి వంట సామగ్రి, ఇతర వస్తువులను కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు రవిశేఖర్, హెచ్ఎం బిచ్యానాయక్‌తో కలిసి మండల విద్యాశాఖాధికారి చంద్రశేఖర్ పలువురు హెచ్ఎంలకు పంపిణీ చేశారు.